మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 78 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnaga Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yada



## కాళేశ్వరంపై పూర్తి నిర్ధారణకు వచ్చాకే నివేదిక ఇస్తాం

3లో..



- రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తాం
- త్వరలోనే విద్యాకమిషన్

- ఏకోపాధ్యాయ పాఠశాలను మూసివేయం

# ప్రభుత్వ పాఠశాలల దశ,దిశ మారుస్తాం

- రూ.2 వేల కోట్లతో ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణ
- మెగా డీఎస్సీతో టీచర్ల నియామక ప్రక్రియ
- ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటను ప్రోత్సహించాలి
- ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాల నుంచి వచ్చినవారే
- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రతిభాపురస్కారాల ప్రధానోత్సవంలో సీఎం రేవంత్
- టెన్త్‌లో పది గ్రేడ్ సాధించిన విద్యార్థులకు సన్మానం



న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):
ప్రతీ గ్రామం, ప్రతీ తండాకు విద్యను అందించేలా తమ ప్రభుత్వం ముందుకెళ్తుందని ఉద్ఘాటించారు. శిథిలావస్థకు చేరిన అన్ని ప్రభుత్వ పాఠశాలల భవనాలను పునర్నిర్మించేందుకు రూ.2వేల కోట్లతో పనులు ప్రారంభించామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. విద్యార్థులను బడిలో చేర్పించేందుకు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని తమ ప్రభుత్వం నిర్వహిస్తోందని ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణను మహిళా సంఘాలకు అప్పగించామని తెలిపారు. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వ పాఠశాలలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. విద్యార్థులు రావట్లేదని సింగిల్ టీచర్ ఉన్న పాఠశాలలను మూసివేయొద్దని సంబంధిత అధికారులను ఆదేశించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో సర్కార్ పాఠశాలలను సరిగా పట్టించుకోలేదని.. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం మౌలిక వసతులపై దృష్టి కేంద్రీకరించకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. తమ ప్రభుత్వానికి భేషజాలు లేవు.. ఎవరైనా సలహాలు, సూచనలు ఇస్తే స్వీకరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. ఇలాంటి కార్యక్రమాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తే బాగుండేదన్నారు. వందేమాతరం ఫౌండేషన్ ఇలాంటి మంచి కార్యక్రమం ద్వారా తమ బాధ్యతను గుర్తు చేసిందని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలతో పోటీ పడి సర్కార్ పాఠశాలల విద్యార్థులు రాణించడం ప్రభుత్వానికి గర్వకారణమని అభినందించారు. కార్పొరేట్ పాఠశాలలతో ప్రభుత్వ విద్యార్థులు పోటీపడటం గౌరవాన్ని మరింత పెంచిందని ఉద్ఘాటించారు. విద్యార్థులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. 90శాతం ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ప్రభుత్వ పాఠాశాలల్లో చదివినవారేనని గుర్తుచేశారు. తనతో సహా ప్రముఖ రాజకీయ నాయకులంతా ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో చదివినవారేనని అన్నారు. గ్రీన్ ఛానెల్ ద్వారా నిధులు విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో సెమీ రెసిడెన్షియల్ విధానాన్ని అమలు చేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని అన్నారు. రెసిడెన్షియల్ స్కూల్ ద్వారా తల్లిదండ్రులకు పిల్లల సంబంధాలు బలహీనపడుతున్నాయని ఒక స్టడీ రిపోర్ట్ వచ్చిందని తెలిపారు. గ్రామాల్లో ఉండే పాఠశాలలపై నిర్లక్ష్యం వహించొద్దని హెచ్చరించారు. విద్య మీద ప్రభుత్వం పెట్టేది ఖర్చు కాదు.. పెట్టుబడి అని అభిప్రాయం వ్యక్తం చేశారు. విద్యపై పెట్టుబడి పెడితే సమాజానికి లాభాన్ని చేకూరుస్తుందన్నారు. త్వరలో విద్య, వ్యవసాయ కమిషన్లను ఏర్పాటు చేసి మిగతా 2లో..

## విభజన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

- తెలంగాణ, ఆంధ్రా కేంద్ర మంత్రులకు సీఎం రేవంత్ శుభాకాంక్షలు


హైదరాబాద్, (ప్రజా మంటలు):
కేంద్ర మంత్రులుగా ప్రమాణం చేసిన కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఎక్స్(ట్విటర్) వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ నుంచి మంత్రి వర్గంలో చోటు దక్కించుకున్న రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, భూపతిరాజు శ్రీనివాస్‌వర్మకు అభినందనలు తెలియజేశారు. విభజన చట్టం అమలు, కేంద్రం నుంచి తెలుగు రాష్ట్రాలకు రావాల్సిన నిధుల విడుదలకు కృషి చేయాలని కోరారు. ప్రాజెక్టుల సాధనకు చర్యలు తీసుకోవాలన్నారు. మూడోసారి దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ ఆదివారం సాయంత్రం ప్రమాణం చేశారు.

మిగతా 2లో..

## రుణమాఫీ దిశగా రాష్ట్ర సర్కారు

- పథకంపై సీఎం రేవంత్ సమీక్ష
- ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశం

హైదరాబాద్, (ప్రజా మంటలు):
పంట రుణమాఫీకి విధివిధానాలు రూపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆగస్టు 15వ తేదీ లోపు రుణమాఫీ చేసి తీరాల్సిందేని ఆయన స్పష్టం చేశారు. పూర్తి వివారలు సేకరించి ప్రణాళికలు మిగతా 2లో..



## బస్సుపై దాడి మా పనే..

- ప్రకటించుకున్న పాకిస్థాన్ లష్కరే తొయిబాకు చెందిన టీఆర్ఎఫ్
- మోదీ ప్రమాణం రోజే దాడి.. - రంగంలోకి దిగిన ఎన్ఐఏ



న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):
యాత్రికులే లక్ష్యంగా జమ్మూ కశ్మీర్‌లో పర్యాటక బస్సుపై ఉగ్రవాదులు దాడి జరిపిన క్రమంలో ఎన్ఐఏ రంగంలోకి దిగింది. కొత్త ప్రభుత్వం కోలువు దీరిన వేళ పాక్ ఉగ్రవాదులు మరోమారు కవ్వింపు చర్యలకు దిగారు. ఈ దారుణానికి పాల్పడింది తామేనంటూ పాకిస్థాన్ లష్కరే తొయిబాకు చెందిన ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్) మిగతా 2లో..

## ప్రజ్వల్ రేవణ్ణ కస్టడీ 24 వరకు పొడిగింపు



3లో..

## తెలంగాణ భాజపా అధ్యక్షుడిగా ఈటల?

- కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు కేంద్ర మంత్రివర్గంలో స్థానం దక్కడంతో అవకాశం



హైదరాబాద్((ప్రజా మంటలు):
తెలంగాణకు చెందిన కిషన్‌రెడ్డి, బండి సంజయ్ లకు కేంద్ర మంత్రివర్గంలో స్థానం దక్కడంతో రాష్ట్ర పార్టీలో కూడా భాజపా జాతీయ నాయకత్వం కీలక మార్పులు మిగతా 2లో..

## ఉత్తరాది వారికే పెద్దపీట వేసిన మోడీ


- కేంద్రమంత్రులకు శాఖల కేటాయింపు
- పాతవారికి తిరిగి అవే శాఖలు
- హోంమంత్రిగా అమిత్ షా.. రాజ్‌నాథ్‌కు రక్షణశాఖ
- నిర్మలకు ఆర్థిక శాఖ,..జైశంకర్‌కు విదేశాంగ శాఖ
- నితిన్ గడ్కరీకి రోడ్డురవాణా...అశ్వినీ వైష్ణవ్‌కు రైల్వే
- రామ్మోమన్ నాయుడుకు పౌరవిమానయానం
- కిషన్‌రెడ్డికి గనుల శాఖ..బండికి హోశాఖ సహాయం
- దక్షిణాది మంత్రులకు అప్రధాన శాఖలు
- బాధ్యతలు స్వీకరించిన ప్రధాని మోడీ
- స్వాగతించిన కార్యాలయ సిబ్బంది
- పీఎం కిసాన్ నిధి విడుదల దస్త్రంపై తొలిసంతకం
- ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందన్న ప్రధాని



న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):
ప్రధాన పోర్టుఫోలియోలను ప్రధాని బిజెపి నేతలకే కేటాయించారు. దక్షిణాది రాష్ట్రాలకు అప్రధాన కేటాయింపులు చేశారు. కేవలం ఉత్తరాది వారికే ప్రధాన శృాఖలు కేటాయించడం గమనించవచ్చు. అలాగే పాతవారికి పాతశాఖలనే కేటాయించడం విశేషం. అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, నిర్మలా సీతారామన్, నితన్ గడ్కరీలకు గతంలో నిర్వహించిన శాఖలనే కేటాయించారు. అమిత్ షాకు హోం, నిర్మలకు ఆర్థికశాఖ, నితిన్ గడ్కరీకి రోడ్డు,రవాణా, రాజ్‌నాథ్‌కు రక్షణశాఖలను కేటాయించారు. ఈమేరకు కొత్త మంత్రులకు శాఖలు కేటాయిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. మిగతా 2లో..



## ప్రజా నాడి





## రాష్ట్రమంతటా విస్తరించిన నైరుతి

- పలు జిల్లాల్లో రానున్న రోజుల్లో వర్షాలు

హైదరాబాద్, (ప్రజా మంటలు):
తెలంగాణలోని పలు ప్రాంతాలకు నైరుతి రుతుపవనాలు విస్తరించాయి. ఉత్తర అరేబియా సముద్రం, మిగతా 2లో..



## గొర్రెల స్కామ్‌లో ఏసీబీ దూకుడు

- కస్టడీలోకి మాజీ ఎండి, తలసాని ఓఎస్డీలు





హైదరాబాద్((ప్రజా మంటలు):
తెలంగాణలో గొర్రెల స్కామ్ దర్యాప్తులో ఏసీబీ అధికారులు దూకుడు పెంచారు. నిందితులను ఏసీబీ కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు. సోమవారం మాజీ పశు సంవర్ధక శాఖ ఎండీ రాంచందర్ నాయక్, తలసాని ఓఎస్డీ కళ్యాణ్ లను కస్టడీకి తీసుకున్నారు.కాగా జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉన్న పశు సంవర్ధక శాఖ మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి



## విభజన సమస్యల పరిష్కారానికి
# కృషి చేయాలి
### - తెలంగాణ, ఆంధ్రా కేంద్ర మంత్రులకు సీఎం రేవంత్ శుభాకాంక్షలు

ప్రధాని తర్వాత ప్రమాణం పూర్తిచేసిన 71 మంది కేంద్రమంత్రుల్లో 30 మందికి క్యాబినెట్ హోదా దక్కింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి కేంద్ర కేబినెట్ బెర్త్ దక్కించుకున్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కుమర్, కింజారపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్‌తో పాటు భూపతిరాజు శ్రీనివాసవర్మకు సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. రెండు రాష్ట్రాల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి, రావాల్సిన నిధులపై శక్తివంచన లేకుండా కృషిచేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఈమేరకు సీఎం రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు. విభజన చట్టంలోని అంశాల అమలు, కేంద్రం నుండి తెలుగు రాష్ట్రాలకు రావాల్సిన నిధులు, పథకాలు, ప్రాజెక్టుల సాధనకు కృషి చేయాల్సిందిగా కోరారు. మోదీ 3.0 క్యాబినెట్ లో తెలంగాణ నుంచి ఇద్దరు బీజేపీ ఎంపీలు.. ఏపీ నుంచి ఒక బీజేపీ ఎంపీ, పొత్తులో భాగంగా ఇద్దరు టీడీపీ ఎంపీలకు అవకాశం లభించింది. దీంతో కేంద్ర మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. కిషన్ రెడ్డి, కింజారపు రామ్మోహన్ నాయుడు కు కేబినెట్ హోదా దక్కగా.. బండి సంజయ్ కుమర్ కు స్వతంత్ర హోదా, పెమ్మసాని చంద్రశేఖర్, భూపతిరాజు శ్రీనివాస వర్మ కు సహాయక మంత్రులుగా అవకాశం లభించింది. కేంద్ర మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు.

# పేదలకు పెద్దపీట
### - వారికోసం 3కోట్ల ఇళ్ల నిర్మాణం.. - తొలి కేబినేట్‌లో ప్రధాని మోడీ నిర్ణయం

న్యూఢిల్లీ (ప్రజా మంటలు):
కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన ప్రధాని మోదీ ప్రభుత్వం పేదల కోసం 3 కోట్ల ఇళ్లను నిర్మించనున్నది. ప్రధాని మోదీ నివాసంలో సోమవారం సాయంత్రం జరిగిన తొలి కేబినెట్ సమావేశంలో ఈ మేరకు తొలి నిర్ణయం తీసుకున్నది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద గ్రామీణ, పట్టణాల్లో మరో మూడు కోట్ల గృహాల నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వ సహాయాన్ని కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. 'అర్హత ఉన్న కుటుంబాల సంఖ్య పెరిగిన నేపథ్యంలో గృహ అవసరాలను తీర్చడానికి గ్రామీణ, పట్టణ కుటుంబాలకు మూడు కోట్ల అదనపు ఇళ్ల నిర్మాణం కోసం సహాయం అందించాలని ఈ రోజు జరిగిన కేబినెట్ సమావేశంలో నిర్ణయించారు' అని అధికారులు తెలిపారు.కాగా, 2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం 2015-16 నుంచి ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకాన్ని అమలు చేస్తుంది. అర్హులైన గ్రామీణ, పట్టణ ప్రజలకు గృహాల నిర్మాణం కోసం ఆర్థిక సహాయం అందిస్తోంది. గత పదేళ్లలో ఈ పథకం కింద పేద కుటుంబాల కోసం 4.21 కోట్ల గృహాలను నిర్మించారు.

# రుణమాఫీ దిశగా రాష్ట్ర సర్కారు

సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. పంట రుణమాఫీ, ఇతర అంశాలపై వ్యవసాయ, సహకార శాఖ అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు.ఈ సమీక్షలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, సంబంధిత శాఖా అధికారులు పాల్గొన్నారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీ అమలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రూ.2లక్షల వరకు రుణాలు ఉన్న రైతుల జాబితాను సిద్ధం చేయాలన్నారు. పూర్తి స్థాయిలో బ్యాంకర్ల నుంచి రైతుల వివరాలు సేకరించి అర్హులను గుర్తించాలని సూచించారు. కటాఫ్ డేట్ విషయంలో సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం అధికారులకు స్పష్టం చేశారు.కేవలం బ్యాంకుల నుంచే కాకుండా, పీఏసీఎస్ నుంచి పంట రుణాలు తీసుకున్న రైతుల వివరాలను అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. రూ.2లక్షల రైతు రుణమాఫీ చేసేందుకు పూర్తి స్థాయి వివరాలతో పాటు అవసరమైన అంచనా వ్యయాన్నిరూపొందించాలని సూచించారు. రుణమాఫీకి సంబంధించి విధివిధానాలను రూపొందించి స్పష్టమైన ప్రణాళికతో ముందుకు రావాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లో ఆగస్టు 15లోగా పంట రుణమాఫీ చేసి తీరాలని ముఖ్యమంత్రి అధికారులకు తేల్చి చెప్పారు.

# ప్రభుత్వ పాఠశాలల దశ,దిశ మారుస్తాం

నిరంతరం సమస్యలను పరిష్కరించే వెసులుబాటు కల్పించబోతున్నామని చెప్పారు. 10/10 వచ్చిన విద్యార్థుల అడ్మిషన్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు ఆదేశించారు. ఇంటర్మీడియట్‌లోనూ స్టేట్ ర్యాంకులు సాధించి భవిష్యత్‌లో రాణించాలని ఆకాంక్షిస్తున్నానని అన్నారు. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఉందని.. ప్రజా పాలనపై నమ్మకం కలిగించేలా ముందుకెళ్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్లలో చదివి పదోతరగతిలో 10/10 జీపీఎస్ సాధించిన విద్యార్థులకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రతిభాపురస్కారాలు అందజేశారు. రవీంద్రభారతిలో విద్యార్థులతో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన వందేమాతరం ఫౌండేషన్‌ను ఆయన అభినందించారు.ఈ సందర్భంగా రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితిపై ముఖ్యమంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. కొంత కాలంగా ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యమవుతున్నాయి. స్కూళ్లలో టీచర్లు లేరని విద్యార్థులు రావట్లేదు.. విద్యార్థుల్లేరని బడులు మూసివేస్తున్నారు. ఇది కోడి ముందా, గుడ్డు ముందా అన్నట్లుగా తయారైంది. ప్రభుత్వం టీచర్లను పెట్టకపోతే.. విద్యార్థులు రారు.. విద్యార్థులు రావడం లేదనే నెపంతో సింగిల్ టీచర్ పాఠశాలలన్నింటినీ మూసివేసే పరిస్థితి కొనసాగింది. కొన్ని బడుల్లో విద్యార్థుల కన్నా టీచర్ల సంఖ్యే ఎక్కువగా ఉన్న పరిస్థితి. ఇలాంటి పరిస్థితులన్నింటినీ దృష్టిలో ఉంచుకొనే తక్షణమే 11వేల పైచిలుకు పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చాం. సింగిల్ టీచర్ బడుల్ని మూసేయడానికి వీల్లేదని, తండాలు, గూడేల్లో, మారుమూల ప్రాంతాల్లో ప్రభుత్వ బడులను నిర్వహించడం ద్వారా పేదలు, దళితులు, గిరిజనులకు విద్యను అందుబాటులోకి తీసుకురావాలన్న సంకల్పంతో పనిచేస్తున్నాం' అన్నారు.వందేమాతరం ఫౌండేషన్‌కు అభినందనలు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్ని ప్రోత్సహించడం అభినందనీయం. ప్రభుత్వ బడుల్లో టాపర్లను నిజానికి ప్రభుత్వమే సన్మానించాలి. మట్టిలో మాణిక్యాలుగా రాణించిన విద్యార్థులు ప్రభుత్వానికి మంచి పేరు తెస్తున్నారు. ఒక్కో విద్యార్థిపై ప్రభుత్వం రూ.80వేలు ఖర్చుపెడుతోంది. ప్రభుత్వం పెట్టే ఖర్చులో అధికశాతం టీచర్ల వేతనాలకే పోతోంది. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ద్వారా తల్లిదండ్రుల్లో ప్రభుత్వ బడులపై అవగాహన కల్పించాలి. పిల్లలను చేర్పించకపోతే.. పాఠశాల మూతబడుతుందని తల్లిదండ్రులకు చెప్పాలి. ప్రభుత్వ పాఠశాలలో చదివిన నాకు వాటి విలువ బాగా తెలుసు. అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్వహణ బాధ్యతను మహిళా సంఘాలకే అప్పగించాం. మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా వారికే ఇచ్చి నిధులు గ్రీన్ ఛానెల్ ద్వారా విడుదల చేయాలని ఆర్థికశాఖను ఆదేశించాం. రూ.2వేల కోట్లు.. శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ బడులను బాగు చేసేందుకు కేటాయించాం అన్నారు. 'ప్రతి విద్యార్థికీ అమ్మఒడే తొలి పాఠశాల. రెసిడెన్షియల్ స్కూళ్లలో చిన్న చిన్న పిల్లల్ని చేర్పించడం ద్వారా వారిని అమ్మఒడికి దూరం చేస్తున్నారు. దీనివల్ల తల్లిదండ్రులు, పిల్లల మధ్య సంబంధబాంధవ్యాలు బలహీనపడుతున్నాయని ఒక నివేదిక తెలిపింది. ఇదో సామాజిక సమస్యగా మారే ప్రమాదం ఉంది. గతంలో ఒకే సిలబస్‌ను ఏళ్ల తరబడి అమలు చేసేవారు. మారిన పరిస్థితులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు మార్చలేదు. ఇకపై విద్యా కమిషన్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సిలబస్ మారుస్తాం. విలువైన సూచనలు ఎవరు చేసినా తప్పక పాటిస్తాం. ఇప్పుడు 10/10 జీపీఎస్ వచ్చిన విద్యార్థులు మళ్లీ ఇంటర్‌లోనూ బాగా రాణించాలి. ప్రతి ఒక్కరూ డాక్టర్లు, లాయర్లు, ఇంజినీర్లు, ఐఏఎస్, ఐపీఎస్‌లుగా ఉన్నత స్థానాలకు ఎదగాలని కోరుకుంటున్నా అని సీఎం రేవంత్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డి, టీజీఆర్టీసీ ఎండీ సజ్జనార్, పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, విద్యాశాఖ కమిషనర్ దేవసేన, వందేమాతరం ఫౌండేషన్ నిర్వాహకులు రవీందర్‌తో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరయ్యారు.




## రాష్ట్రమంతటా విస్తరించిన నైరుతి
### - పలు జిల్లాల్లో రానున్న రోజుల్లో వర్షాలు

మహారాష్ట్రలోని మరికొన్ని ప్రాంతాల్లో రుతుపవనాలు విస్తరించనున్నాయి. నాసిక్, నిజామాబాద్, సుకుమా, విజయనగరం, ఇస్లాంపూర్ వరకు విస్తరించనున్నాయి రుతుపవనాలు.నైరుతి రుతుపవనాల విస్తరణ నేపథ్యంలో తెలంగాణలో రానున్న మూడు రోజులు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో కూడిన ఈదురు గాలులతో వర్షాలు కురిసే అవకాశం ఉంది. నల్లగొండ, సూర్యాపేట, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అలాగే దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. దీంతో మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ పేర్కొంది. ఇక రానున్న ఐదు రోజుల పాటు ఈ రాష్ట్రాల్లోఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అయితే.. ఇప్పటికే తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రంపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నందున రెండు రోజుల పాటు ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.దీంతో.. రుతుపవనాలు వేగంగా విస్తరించడం, ఉపరితల ఆవర్తనం కారణంగా తెలంగాణ ప్రభుత్వం పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించింది. తెలంగాణలోని రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్ నగర్ నాగర్ కర్నూల్, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, వనపర్తి, నారాయణపేట్, జోగులాంబ గద్వాల, హైదరాబాద్ జిల్లాల్లో వర్షాలు పడే అవకాశం ఉంది. గంటకు 30-40 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీచే ప్రమాదం ఉంది. ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు పడే



అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. కాగా.. హైదరాబాద్‌లో మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ ప్రకటించిన నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ అధికారులు అప్రమత్తమయ్యారు. అత్యవసర పరిస్థితుల్లో జీహెచ్‌ఎంసీని 040-21111111, 9001136675 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఇక ఏపీలో కూడా కొన్నిచోట్ల వర్షాలు కురుస్తున్నాయి. ఈ.. రుతుపవనాల ప్రభావంతో రాయలసీమలో వర్షాలు కురుస్తున్నాయి. వర్షాల కారణంగా రెండు రాష్ట్రాల్లోనూ ఉష్ణోగ్రతలు పడిపోయాయి. ఇక తెలంగాణలో పగటిపూట 27 నుంచి 36 డిగ్రీల సెల్సియస్ నమోద వుతుంది. ఏపీలో 27 నుంచి 35 డిగ్రీల సెల్సియస్ నమోదవుతోంది. తెలంగాణలో సోమ, మంగళవారాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, నల్గొండ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్గాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే అవకాశం ఉంది.

## తెలంగాణ భాజపా అధ్యక్షుడిగా ఈటల?


చేయనున్నట్లు తెలుస్తోంది.కిషన్‌రెడ్డి ఇప్పటికే రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. భాజపాలో ఒకరికి రెండు పదవులు అనేది చాలా తక్కువ సందర్భాల్లోనే ఉంటుందని, కిషన్‌రెడ్డి స్థానంలో పార్టీకి కొత్త అధ్యక్షుడిని నియమించవచ్చని తెలుస్తోంది.ఈ పదవిలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ను నియమించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. కొత్త పేర్లు కూడా పరిశీలించే వీలుందని పలువురు నేతలు విశ్లేషిస్తున్నారు. బండి సంజయ్ ఇప్పటికే జాతీయ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తుండటం.. తాజాగా కేంద్ర మంత్రి అయిన నేపథ్యంలో ఒక పదవికే పరిమితం చేస్తారని చర్చ నడుస్తోంది. మరోవైపు అమిత్‌షాను ఈటల రాజేందర్ కలిశారు. కేంద్ర మంత్రిగా ప్రమాణం చేసిన ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఉత్తరాది వారికే పెద్దపీట వేసిన మోడీ

టిడిపి నుంచి కొతత్గా కేబినేట్‌లో చేరిన రామ్మోమన్ నాయుడుకు కేంద్ర విమానయాన శాఖను కేటాయించారు. ఇప్పటి వరకు దీనిని జ్యోతిరాదిత్య నిర్వహించారు. భాజపా సీనియర్ నేత నితిన్ గడ్కరీకి మరోసారి రోడ్లు, రవాణా శాఖ కేటాయించారు. మోదీ 2.0లో విదేశీ వ్యవహారాల బాధ్యతలను చేపట్టిన జై శంకర్‌కు మళ్లీ అదే శాఖ బాధ్యతలను అప్పగించారు. ఆర్థిక శాఖ బాధ్యతలను మళ్లీ నిర్మలమ్మకే ఇచ్చారు. తెలుగు రాష్ట్రాల నుంచి రామ్మోహన్ నాయుడికి పౌరవిమానయాన బాధ్యతలు అప్పగించారు. ప్రధాని మోదీతో పాటు ఆదివారం 71 మంది మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. అందులో 30 మంది కేబినెట్ మంత్రులు కాగా.. 36 మంది సహాయ మంత్రులుగా, ఐదుగురు స్వత్రంత్ర మంత్రులు ఉన్నారు. వీరికి తాజాగా కేటాయింపులు జరిపారు. తర మంత్రుల శాఖలు ఇలావున్నాయి. రాజ్‌నాథ్ సింగ్ (భాజపా)- రక్షణ శాఖ, అమిత్ షా (భాజపా)- హోంమంత్రిత్వ శాఖ, నితిన్ గడ్కరీ (భాజపా)- రోడ్లు, రహదారులు, జగత్ ప్రకాశ్ నడ్డా (భాజపా)- ఆరోగ్యశాఖ, శివరాజ్ సింగ్ చౌహాన్ (భాజపా)- వ్యవసాయం, రైతు సంక్షేమం, నిర్మలా సీతారామన్ (భాజపా)- ఆర్థికశాఖ, సుబ్రహ్మణ్యం జైశంకర్ (భాజపా)- విదేశీ వ్యవహారాలు, మనోహర్ లాల్ ఖట్టర్ (కొత్త) (భాజపా)- విద్యుత్, గృహనిర్మాణశాఖ, హెచ్.డి. కుమారస్వామి (కొత్త) (జేడీఎస్)- భారీ పరిశ్రమలు, ఉక్కు పీయూష్ వేద్ ప్రకాశ్ గోయల్ (భాజపా)- కామర్స్ అండ్ ఇండస్ట్రీస్, ధర్మేంద్ర ప్రధాన్ (భాజపా) - విద్యాశాఖ, జీతన్ రామ్ మాంఝి (హెచ్ఏఎం) -వంటి శాఖలను కేటాయించారు. కిషన్ రెడ్డికి బొగ్గుగనుల శ్ఖాఖను కేటాయించారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి - బండి సంజయ్,గనుల శాఖ - కిషన్ రెడ్డి రోడ్డు రవాణా శాఖ సహాయమంత్రులు - అజయ్ టమ్టా, హర్ష్ మల్హోత్రా, గృహ నిర్మాణ శాఖ, పట్టణాభివృద్ధి - నమోహర్ లాల్ ఖట్టర్, పెట్రోలియం శాఖ - హర్దీప్ సింగ్ పూరి, రైల్వే, సమాచార, ప్రసార శాఖ - అశ్వినీ వైష్ణవ్, వాణిజ్యం - పీయూష్ గోయల్,పౌర విమానాయన శాఖ - రామ్మోహన్ నాయుడు, గజేంద్ర షెకావత్-సాంస్కృతిక పర్యాటక శాఖ, భూపేంద్ర యాదవ్- పర్యావరణ శాఖ,క్రీడలు- చిరాగ్ పాశ్వాన్ కిరణ్ రిజుజు- పార్లమెంటరీ వ్యవహారాలు, మన్‌సుఖ్ మాండవీయా - కార్మిక శాఖ, క్రీడలు భూపేందర్ యాదవ్ - పర్యావరణ శాఖ,సీఆర్ పాటిల్ - జల్ శక్తి శాఖ లను కేటాయించారు.

**బాధ్యతలు స్వీకరించిన ప్రధాని మోడీ**

భారత ప్రధానిగా నరేంద్రమోదీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. దిల్లీలోని సౌత్‌బ్లాక్‌లోని పీఎంఓ కార్యాలయంలో మూడో దఫా తన విధుల్ని మొదలుపెట్టేశారు. ఈ సందర్భంగా రైతులకే తొలి ప్రాధాన్యం ఇచ్చారు. పీఎం కిసాన్ నిధి విడుదల దస్త్రంపై తొలిసంతకం చేశారు. దీంతో 9.3 కోట్లమంది రైతులకు రూ.20వేల కోట్ల ఆర్థిక సహాయం అందుతుంది. మా ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉంది. బాధ్యతలు



స్వీకరించిన తర్వాత తొలి సంతకం వారి సంక్షేమానికి సంబంధించినదే కావడం విశేషం. రాబోయే రోజుల్లో వ్యవసాయరంగానికి, కర్షకుల సంక్షేమంపై మా ప్రభుత్వం మరింత దృష్టి సారించనుందని సంతకం చేసిన తర్వాత మోదీ వెల్లడించారు. ఇదిలా ఉంటే.. ఈరోజు మోదీ క్యాబినెట్ తొలి సమావేశం జరగనుంది. పార్లమెంట్ సమావేశాలను ఏర్పాటు చేయాలని రాష్ట్రపతి ద్రౌపదిముర్మును అభ్యర్థించనుంది. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన వేళ జరగబోయే సమావేశాల ప్రారంభం రోజున రెండు సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగిస్తారు. ఈ ప్రభుత్వ దార్శనికత, ప్రాధాన్యతలను పేర్కొంటారు. 2014, 2019 ఎన్నికల్లో విజయం తర్వాత రెండుసార్లు ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన మోదీ.. తాజా ఎన్నికల్లో కూటమి విజయదుందుభితో వరసగా మూడోసారి పీఠమెక్కిన ఘనత సాధించారు. జవహర్‌లాల్ నెహ్రూ తర్వాత దేశంలో వరసగా మూడోసారి ప్రధాని అయిన ఘనతను సొంతం చేసుకున్నారు. తాజా కేంద్ర సర్కార్ 71 మంది మంత్రులతో కొలువుదీరింది. అందులో 30 మంది క్యాబినెట్ మంత్రులుగా ఉన్నారు.భారతదేశ ప్రధానిగా నరేంద్ర మోదీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఢిల్లీలోని పార్లమెంట్ సౌత్ బ్లాక్‌లోని ప్రధాని కార్యాలయంలో ఆయన మూడోసారి తన విధుల్ని నిర్వర్తించేందుకు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా పీఎంవోలోని ఉద్యోగులు, సిబ్బంది ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. వారందరికీ అభివాదం చేస్తూ ఆయన ముందుకు సాగారు. రాష్ట్రపతి భవన్‌లో ఆదివారం సాయంత్రం ఆయన మూడోసారి ప్రధానిగా ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు. మోదీతో పాటు 71 మంది కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు.ఈ క్రమంలో పీఎం కిసాన్ నిధి 17వ విడత నిధుల విడుదల దస్త్రంపై తొలి సంతకం చేశారు. దీంతో 9.30 కోట్ల మంది రైతులకు రూ.20 వేల కోట్ల ఆర్థిక సాయం అందుతుంది. తమ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని ఆయన అన్నారు. 'రాబోయే కాలంలో రైతులు, వ్యవసాయ రంగానికి మరింత కృషి చేస్తాం. మాది కిసాన్ కళ్యాణ్‌కు పూర్తిగా కట్టుబడి ఉన్న



ప్రభుత్వం.. అందువల్ల బాధ్యతలు స్వీకరించిన తర్వాత సంతకం చేసిన మొదటి ÷ల్ రైతు సంక్షేమానికి సంబంధించినది కావడం సముచితం.' అని ప్రధాని పేర్కొన్నారు.

**కలిసి పనిచేద్దాం..అభివృద్ధి సాధిద్దాం**

మూడోసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత నరేంద్రమోదీ పీఎంఓ సిబ్బందితో మాట్లాడారు. ప్రభుత్వం అంటే మోదీ ఒక్కరే కాదని, ఎంతోమంది ఆలోచనల సమాహారమని అన్నారు. పదేళ్ల క్రితం పీఎంఓ అంటే ఒక అధికార కేంద్రం అనే భావన ఉండేదన్నారు. అలాగే తాను నిత్యం ఉత్సాహంగా ఉండటానికి గల రహస్యాన్ని వెల్లడించారు. 'పీఎంఓ ఒక అధికార కేంద్రంలా ఉండాలన్నది నా విధానం కాదు. నేను అధికారం కోసం జన్మించలేదు. 2014కు ముందున్న భిన్నమైన పరిస్థితులను మార్చే దిశగా నిర్ణయాలు తీసుకున్నాం. పీఎంఓ ఎప్పుడూ ప్రజల కోసం పని చేయాలి. అది మోదీ పీఎంఓగా ఉండకూడదు. మనందరి లక్ష్యం.. దేశమే ప్రథమం, మనందరి మోటివేషన్.. 2047 నాటికి వికసిత్ భారత్ సాధించుకోవడం. 2047 కోసం నిర్విరామంగా పని చేస్తానని దేశ ప్రజలకు హామీ ఇచ్చాను. నా బృందం నుంచి నాకు అలాంటి అంచనాలే ఉన్నాయి. మనం సమయం చూసుకొని, కాలానికి కట్టుబడి పనిచేసే వ్యక్తులం కాదు. మన ఆలోచనలకు పరిమితి లేదు. ఇలాంటి పరిమితులు లేకుండా పని చేసేవారే నా జట్టు సభ్యులు. వారినే ఈ దేశం విశ్వసిస్తుంది. ఈ పది సంవత్సరాల్లో నేను ఆలోచించిన దానికంటే ఎక్కువ ఆలోచించడం. నేను చేసిన దానికంటే ఇంకా ఎక్కువ చేయడం నా బాధ్యత అని నేను అనుకుంటున్నాను. జీవితంలో మనం నెరవేర్చుకోవాలనుకున్న కోరిక స్థిరంగా ఉన్నప్పుడు.. కాలక్రమంలో దానికి స్థిరత్వం వస్తుంది. అప్పుడు దానిని నెరవేర్చుకునే క్రమంలో అది ఒక తీర్మానంగా మారుతుంది. ఆ తీర్మానానికి కఠోర శ్రమ కలిస్తే.. విజయంగా మారుతుంది. ప్రతిఒక్కరూ నా ఎనర్జీకి కారణమేంటని అడుగుతుంటారు. ప్రతి వ్యక్తి తన లోపలి విద్యార్థిని సజీవంగా ఉంచితే.. ఎప్పటికీ శక్తిహీనుడు కాడు' అంటూ తనలోని ఉత్సాహానికి గల కారణం చెప్పారు. తన ప్రసంగం ద్వారా సిబ్బందిలో ప్రేరణ నింపారు.

# బిజెపిలో సంస్థాగత మార్పులకు రంగం సిద్ధం

### నడ్డా కేబినేట్‌లో చేరడంతో మారనున్న బిజెపి
### నితీశ్, బాబులను రెచ్చగొడుతున్న ఇండికూటమి
### మీడియాతో మంత్రి కిషన్ రెడ్డి





న్యూఢిల్లీ,జూన్10 (ప్రజా మంటలు): బీజేపీలో సంస్థాగతంగా కీలక మార్పులు జరగబోతున్నాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఇంతకాలం పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఉన్న జేపీ నడ్డాను మంత్రివర్గంలోకి తీసుకోవటంతో ఆయన స్థానంలో మరొకరిని తీసుకుంటారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర శాఖకూ కొత్త సారథి నియామకం జరగబోతుందన్నారు. మంత్రివర్గ ప్రమాణస్వీకారం పూర్తయిన నేపథ్యంలో పార్టీ సంస్థాగత మార్పులపై త్వరలోనే కసరత్తు చేసి కొత్తవారిని నియమిస్తారని స్పష్టం చేశారు. ఇండియా కూటమిది దివాళాకోరు రాజకీయమని విమర్శించారు. ప్రధాని ప్రమాణస్వీకారానికి ప్రతిపక్షం రాకపోవడం ఇదే మొదటిసారి అన్నారు. చంద్రబాబు నాయుడు, నితీష్ కుమార్‌ను ఇండియా కూటమి రెచ్చగొడు తుందని కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఎన్నికలకు ముందే చంద్రబాబు, నితీష్‌తో పొత్తు పెట్టుకున్నామని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రమాణానికి ముందు కొత్త కేబినెట్‌కు మోదీ దిశానిర్దేశర చేశారని.. మంత్రులు నడుచుకోవాల్సిన విధానంపై హితబోధ చేశారని కిషన్ రెడ్డి తెలిపారు. మోదీ కేబినెట్‌లో మరోసారి చోటు దక్కడం చాలా సంతోషంగా ఉందని, ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి శుభాకాంక్షలు తెలుపుతున్నానని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన ఢిల్లీలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటిసారిగా కేబినెట్ మంత్రిగా పనిచేశానని, ఇప్పుడు రెండోసారి కేంద్ర మంత్రిగా అవకాశం వచ్చిందని చెప్పారు. కేంద్ర క్యాబినెట్‌లో ఎలాంటి శాఖ ఇచ్చిన సమర్థవంతంగా పనిచేస్తానని స్పష్టం చేశారు. తనను ఎంపీగా గెలిపించిన సికింద్రాబాద్ ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రానికి గతంలో కూడా ఎన్నో ప్రాజెక్టులు తీసుకొచ్చానన్నారు. కొందరు రాజకీయంగా తనను విభేదించి.. కామెంట్లు చేసే మూర్ఖులను అసలు పట్టించుకోనన్నారు. రీజనల్ రింగ్ రోడ్డు టెక్స్టైల్ పార్కు, రైల్వే ప్రాజెక్టులు , కేంద్ర సంస్థలు తీసుకొచ్చానని కిషన్ రెడ్డి తెలిపారు.

## ముగిసిన ఎటెస్ పిజిసెట్ పరీక్ష

హైదరాబాద్, జూన్ 10 (ప్రజా మంటలు): టీఎస్ పీజీఈసెట్ -2024 ప్రవేశ పరీక్ష విజయవంతంగా ముగిసింది. హైదరాబాద్, వరంగల్‌లో ఆన్‌లైన్‌లో కంప్యూటర్ బేస్డ్ విధానంలో నిర్వహించారు. ఎంఈ, ఎంటెక్, ఎం ఫార్మ్, ఎం ఆర్క్, గ్రాడ్యుయేట్ లెవల్ ఫార్మ్ డీ కోర్సుల్లో ప్రవేశాల నిమిత్తం ఈ పరీక్ష నిర్వహించినట్లు కన్వీనర్ పేర్కొన్నారు. ఈ ప్రవేశ పరీక్షను రెండు సెషన్లలో నిర్వహించారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు నిర్వహించిన సెషన్‌లో జియో ఇంజినీరింగ్ అండ్ జియో ఇన్ఫర్మెటిక్స్, ఫార్మసీ కోర్సులకు ప్రవేశ పరీక్ష జరిగింది. ఈ సెషన్‌లో 7,461 మంది అభ్యర్థులకు గానూ 7179 మంది హాజరయ్యారు. 96.22 శాతం మంది పరీక్ష రాశారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు నిర్వహించిన రెండో సెషన్‌లో సివిల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, ఫుడ్ టెక్నాలజీ, ఏరోస్పేస్ ఇంజినీరింగ్ వంటి కోర్సులకు ప్రవేశ పరీక్ష జరిగింది. ఈ సెషన్‌కు 5477 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 4898 మంది హాజరయ్యారు. 89.43 శాతం మంది పరీక్ష రాశారు.

## బిఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి 2లక్షల ఇన్సూరెన్స్

### కార్యకర్తలకు అండగా ఉంటామన్న ఎమ్మెల్యే కొత్త



సిద్దిపేట, జూన్ 10 (ప్రజా మంటలు): బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటూ వారిని కడుపులో పెట్టుకొని చూస్తుందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. మిరుదొడ్డి టౌన్‌కు చెందిన కాస కల్యాణ్ బీఆర్ఎస్‌లో కీలక కార్యకర్తగా పార్టీకి సేవలు అందిస్తూ ఇటీవలేరోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కల్యాణ్‌కు బీఆర్ఎస్ పార్టీలో పార్టీ సభ్యత్వం ఉండడంతో రూ.2 లక్షల ఇన్సూరెన్స్ చెక్కును సోమవారం ఎమ్మెల్యే బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తలను కంటికి రెప్పలా చూసుకునేది కేవలం బీఆర్ఎస్ పార్టీ మాత్రమేనని అన్నారు. కార్యకర్తలకు ఏ ఆపది వచ్చినా ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు. గ్రామాల్లోని ప్రజలు అధైర్య పడకుండా ఉంటూ పార్టీకి వెన్నుదన్నుగా నిలువాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్లు వల్లాల తస్యనారాయణ, నంట బాపురెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ సల్లూరి మల్లేశం, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కాస కిష్టయ్య, కాస నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా సైకోలు జైలుకెళ్లడం ఖాయం

### 11 సీట్లే ఇచ్చిన ఆగని దాడులు: పట్టాభి



విజయవాడ, జూన్ 10 (ప్రజా మంటలు): వైఎస్సార్సీపి సైకో మూకలు జైలుకెళ్లడానికి సిద్ధం కావాలని తెలుగుదేశం పార్టీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ హెచ్చరించారు. ప్రజలు మక్కెలు విరగొట్టి 11సీట్లతో మోకాళ్లపై కూర్చోబెట్టినా వైసీపీ నేతల అరాచకాలు ఆగడంలేదని ధ్వజమెత్తారు. కర్నూలు జిల్లాలో టీడీపీ నేత గిరినాథ్‌ను వైసీపీ సైకో మూకలు దారుణంగా హతమార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఐదేళ్లలో వైసీపీ నాయకులు అరాచకాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందనిర్ అయ్యారు.టీడీపీ కార్యాయలంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టాభిరామ్ మాట్లాడుతూ.. టీడీపీ కార్యాకర్తలపై లెక్కలేనన్ని దాడులు చేశారని చెప్పారు. టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పాదయాత్రపై 22 సార్లు దాడి చేశారని దుయ్యబట్టారు. ఆనాడు వైసీపీకి ప్రజాస్వామ్యం గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. చెన్నుపాటి గాంధీపై దాడిచేసి కన్ను పోగొట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎర్రగొండపాలెం, నందిగామలో చంద్రబాబు పర్యటనలపై దాడిచేశారన్నారు. తాడిపత్రిలో జేసీ ప్రభాకర్ రెడ్డి ఇంటిపై చాలాసార్లు దాడి చేశారు... అప్పుడు వైసీపీ నేతలకు ప్రజాస్వామ్యం గుర్తుకు రాలేదా? అని నిలదీశారు. తనపై దాడిచేసి తన బిడ్డను భయపెట్టినప్పుడు వైసీపీ సైకోలకు ప్రజాస్వామ్యం గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీ ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తుందని స్పష్టం చేశారు. కూటమి పార్టీలు ప్రజాస్వామ్య పరిరక్షణ కట్టుబడి ఉన్నాయని ఉద్ఘాటించారు. తెలుగుదేశం హింసను ప్రేరేపించదు... చంద్రబాబు ప్రజాస్వామ్య విలువలను తమకు ఎప్పుడూ గుర్తు చేస్తారని వివరించారు. ఏపీలో ఎక్కడా భౌతికదాడులు జరగవు.. వైసీపీ నేతలు భయపడాల్సిన పనిలేదన్నారు. ఐసీపీ సెక్షన్ల పవరేంటో చూపిస్తాం.. తప్పు చేసిన వారిని వదిలిపెట్టామని వార్నింగ్ ఇచ్చారు. లోకేశ్ రెడ్ బుక్ రియాల్టీ ఏంటో చూపిస్తామని పట్టాభి రామ్ పేర్కొన్నారు.

# మోడీ ప్రమాణం రోజే ఉగ్రదాడి

### మరోమారు ఉగ్రవాదుల కవ్వింపు చర్యలు - రంగంలోకి దిగిన ఎన్ఐఎ



న్యూఢిల్లీ, జూన్ 10 (ప్రజా మంటలు): యాత్రికులే లక్ష్యంగా జమ్మూ కశ్మీర్‌లో పర్యాటక బస్సుపై ఉగ్రవాదులు దాడి జరిపిన క్రమంలో ఎన్ఐఎ రంగంఓలకి దిగింది. కొత్త ప్రభుత్వం కోలువు దీరిన వేళ పాక్ ఉగ్రవాదులు మరోమారు కవ్వింపు చర్యలకు దిగారు. ఈ దారుణానికి పాల్పడింది తామేనంటూ పాకిస్థాన్ లష్కరే తొయిబాకు చెందిన ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్) ప్రకటించుకుంది. అంతేకాకుండా ఇటువంటి మరిన్ని దాడులకు పాల్పడతామని హెచ్చరించింది. ప్రధానమంత్రిగా మూడోసారి మోదీ ప్రమాణ స్వీకారం చేసే రోజే ఈ దాడి జరగడం గమనార్హం. శివఖోరి ఆలయం నుంచి కట్రాలోని మాతా వైష్ణోదేవీ ఆలయానికి వెళ్తోన్న బస్సుపై ఉగ్రవాదులు ఆదివారం మెరుపుదాడి చేశారు. డ్రైవర్‌కు బు÷-లలెట్ తాకడంతో వాహనం అదుపు తప్పి పక్కనే ఉన్న లోయలో పడిపోయింది. ఈ ఘటనలో 9 మంది మరణించగా.. 33 మంది గాయపడ్డారు. డ్రైవర్‌తో సహా కండక్టర్ కూడా మరణించినట్లు అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో ప్రాణాలతో బయటపడిన బాధితులు ఆ భయానక క్షణాలను గుర్తుచేసుకున్నారు. ముఖాలకు మాస్కులు పెట్టుకొని ఉన్న ఆరు లేదా ఏడుగురు ఉగ్రవాదులు బస్సుపై కాల్పులకు తెగబడ్డారు. తొలుత అన్ని వైపులా కాల్పులు జరిపిన ముష్కరులు.. బస్సు లోయలో పడగానే అటుగా వచ్చి మళ్లీ కాల్పులు కొనసాగించారు. ఆ సమయంలో తాము చనిపోయినట్లు నమ్మించేందుకు మౌనంగా ఉండిపోయాం. ఎలాగైనా ఇంటికి తిరిగి వెళ్లడమే ముఖ్యమని అనుకున్నాం. ఓ పది, పదిహేను నిమిషాల తర్వాత స్థానికులు, పోలీసులు వచ్చి మమ్మల్ని కాపాడారు' అని ప్రాణాలతో బయటపడిన పలువురు బాధితులు మీడియాకు వెల్లడించారు. పాకిస్థాన్ ఉగ్రవాదులు ఈ దాడులకు పాల్పడినట్లు పేర్కొన్న నేపథ్యంలో రంగంలోకి దిగిన ఎన్ఐఏ.. స్థానిక పోలీసులతో కలిసి దర్యాప్తు మొదలుపెట్టినట్లు సమాచారం. మరోవైపు హంతకుల వేట కోసం ఆర్మీ, సీఆర్పీఎఫ్, స్థానిక పోలీసులు కలిసి కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. డ్రోన్లతోనూ పరిసర ప్రాంతాల్లో గాలిస్తున్నాయి. రియాసీ, ఉధంపూర్, పూంచ్, రాజౌరీ ప్రాంతాల్లోనే ఈ ఉగ్రమూకలు తలదాచుకున్నట్లు భావిస్తున్నారు.

## సజావుగా ధాన్యం కొనుగోళ్లు గతం కన్నా మిన్నగా సేకరణ

### హరీష్ రావు పనీపాటలేక విమర్శలు
### మండిపడ్డ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



హైదరాబాద్, జూన్ 10 (ప్రజా మంటలు): ధాన్యం కొనుగోళ్లలో రేవంత్ ప్రభుత్వం కొత్త రికార్డు సాధించిందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. గతాన్ని మించి ధనా÷-యం కొనుగోళ్లు జరిగాయని అన్నారు.మాజీ మంత్రి హరీష్ రావుకు పనీపాట లేలని.. అందుకే ప్రభుత్వంపై లేని పోని విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. సొంత పార్టీలో ఉనికి కోసమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ పరిస్థితి ఎందుకు ఇలా అయిందోనని హరీష్ తన మామని నిలదీయాలన్నారు. గాయిగాయి చేయడం హరీష్ మానుకోవాలని హితవు పలికార్గు ÷ళిడు(సోమవారం) అసెంబ్లీ మీడియా హాల్లో ఆది శ్రీనివాస్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికల్లో లబ్ధి కోసమే హరీష్ రాజీనామా డ్రామా చేశారని విమర్శలు చేశారు. రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు హరీష్‌కి లేదని చెప్పారు. పనికిమాలిన విషయాలు మానేసి లోక్‌సభ ఎన్నికల్లో డిపాజిట్లు కోల్పోయిన అంశంపై కేటీఆర్, హరీష్ చర్చించుకోవాలన్నారు. పదవి ఉండాలి, ప్రజల్లో సానుభూతి ఉండాలనే హరీష్ ఆరాటపపడుతున్నారని అన్నారు.తమ ప్రభుత్వంలో 69 లక్షల మంది రైతులకు రైతు బంధు ఇచ్చామని స్పష్టం చేశారు. తన మామ సీఎంగా ఉన్నప్పుడు రైతుబంధు ఎప్పుడు ఇచ్చారో హరీష్ చెప్పాలని ప్రశ్నించారు. రియల్ ఎస్టేట్ వెంచర్లకు, కొండలు, గుట్టలకు రైతుబంధు ఇచ్చేది లేదని తేల్చిచెప్పారు. ఆగస్టు 15వ తేదీన మాజీ ఎమ్మెల్యే కావడానికి హరీష్ మానసికంగా సిద్ధంగా ఉండాలని ఆది శ్రీనివాస్ సవాల్ విసిరారు.

## భోజన కార్మికులకు గౌరవ వేతనం ఇవ్వాలి



ఆదిలాబాద్,జూన్ 10 (ప్రజా మంటలు): మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు ప్రతినెల గౌరవ వేతనం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని భోజన పథకం యూనియన్ జిల్లా కార్యదర్శి లింగాల చిన్నన్న అన్నారు. సోమవారం ఆదిలాబాద్ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో యూనియన్ జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు యూనిఫామ్స్ ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కోడి గుడ్లుకు ప్రత్యేక బ్జడెట్ కేటాయించాలన్నారు. సబ్సిడీపై వంటగ్యాస్‌ను సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల కార్మికులు పాల్గొన్నారు.

## తప్పుడు ధృవపత్రాలతో ప్లాట్ల కబ్జా

### కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన కాలనీవాసులు



ఆదిలాబాద్,జూన్ 10 (ప్రజా మంటలు): ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కైలాష్ నగర్ 38వ వార్డులో సొసైటీకి సంబంధించిన 8 ప్లాట్లలో 2 ప్లాట్లని తప్పుడు ధ్రువ పత్రాలతో కబ్జా చేసేందుకు యత్నిస్తున్న కబ్జాదారులపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కాలనీ డెవలప్ మెంట్ కమిటీ అధ్యక్షుడు లోక ప్రవీన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు దుర్గం శేఖర్ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ రాజర్షి షాను కలిసి వారు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ అక్కడే ఉన్న మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్‌ను పిలవగా.. ఆయనే కబ్జాదారులకు సహకరిస్తున్నట్లు కాలనీ వాసులు ఆరోపించారు. దీంతో మంగళవారం ఆర్డిఓ, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్ స్థలాన్ని సందర్శించి విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. కబ్జా చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని ఆదేశించారు. కాలనీ వాసులు ముత్యాల చిట్టీ బాబు, రాంకిషన్, రాంకుమార్, రాంరెడ్డి, కొండల్ రావ్, బాబురావు, రాకేష్, త్రినాథ్, ప్రవీణ్ అగర్వాల్ తదితరులు ఉన్నారు.

## కాళేశ్వరంపై పూర్తి నిర్ధారణకు వచ్చాకే నివేదిక ఇస్తాం

### పలువురికి నోటీసులు ఇచ్చిన చంద్ర ఘోష్ కమిటీ
### విచారణకు రావాలని నిర్మాణ సంస్థలకు ఆదేశాలు



హైదరాబాద్, జూన్ 10 (ప్రజా మంటలు): కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో జరిగిన అవకతవక లపై చంద్ర ఘోష్ కమిటీ విచారణ చేపట్టింది. తాజాగా ఈ విచారణను వేగవంతం చేసింది. ప్రాజెక్ట్‌ను ఇప్పటికే చంద్ర ఘోష్ కమిటీ సందర్శించింది. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పలు కీలక విషయాలపై ఈ కమిటీ దృష్టి సారించింది. కమిటీకి ఈ ప్రాజెక్ట్‌పై పలు ఫిర్యాదులు అందడంతో విచారణను ముమ్మరం చేసింది, విచారణకు సంబంధించిన పలు విషయాలను సోమవారం మీడియాకు కాళేశ్వరం కమిషన్ చీఫ్ చంద్ర ఘోష్ వెల్లడించారు.విచారణ వేగవంతం చేసినట్లు తెలిపారు. సోమవారం 7 మందికి విచారణకు రావాలని నోటీసులు ఇచ్చామని అన్నారు. మంగళవారం 18 మంది విచారణకు రావాలని నోటీసులు ఇచ్చామని చెప్పారు. మొన్నటి వరకు తెలంగాణలో ఎలక్షన్ కోడ్ ఉందని.. అందుకే కొంత ఆలస్యం అవుతుందని అన్నారు. అన్ని విషయాలు రానున్న రోజుల్లో బయటకు వస్తాయని స్పష్టం చేశారు. విచారణకు వచ్చే అధికారులకు నోటీస్ ఇచ్చామన్నారు. ప్రాజెక్ట్ అవకతవకలపై 54 ఫిర్యాదులు వచ్చాయని.. విచారణ ముమ్మరం చేస్తామన్నారు. ఫిర్యాదులో నష్టపరిహారానికి సంబంధించినవి కూడా వచ్చాయని పేర్కొన్నారు. ప్రాజెక్ట్‌కు కట్టిన ఏజెన్సీలను విచారణకు రావాలని నోటీసులు జారీ చేశామని అన్నారు. నిజాలు తెలుసుకునేందుకు అందరి వద్దా ఉన్న సమాచారం తీసుకుంటున్నామని తెలిపారు. జూన్ 30వ తేదీ లోపు విచారణ పూర్తి కాదని.. ఇంకా సమయం పడుతుందని చెప్పారు. విచారణ వేగంగా జరుగుతుందని స్పష్టం చేశారు. అసలు విషయాలు, నిజాలు తెలుసుకోకుండా పూర్తి నివేదిక ఇవ్వలేనని అన్నారు. టెక్నికల్ అంశాల విచారణ పూర్తి అయ్యాక, రెగ్యూలర్, ఆర్థిక, అంశాలపై విచారణ మొదలు అవుతుందన్నారు. ప్రభుత్వం నుంచి రిపోర్టులు అన్ని అందాయని.. వాటి పరిశీలన జరుగుతుందని చంద్ర ఘోష్ పేర్కొన్నారు.

### ప్రజ్వల్ రేవణ్ణ కస్టడీ 24 వరకు పొడిగింపు

బెంగళూరు(ప్రజా మంటలు): రేవణ్ణ లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటున్న కర్ణాటక హసన్ మాజీ ఎంపి ప్రజ్వల్ రేవణ్ణ కస్టడీని పొడిగించారు. ఇతన్ని మే 31న కర్ణాటక పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసును కర్ణాటక ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందానికి అప్పగించింది. అయితే ఈ కేసులో బెంగళూరు ప్రజ్వల్ రేవణ్ణకి కస్టడీని పొడిగించింది. తాజాగా ఈ కేసుకు సంబంధించి సోమవారం బెంగళూరు కోర్టు ప్రజ్వల్‌కి జ్యుడిషియల్ కస్టడీ 24 వరకూ పొడిగిస్తూ సోమవారం తీర్పు ఇచ్చింది. అయితే ఈ కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సోమవారం ఉదయానికి విచారణ పూర్తయింది. కానీ సిట్ తదుపరి కస్టడీని కోరలేదు.

### గొర్రెల స్కామ్‌లో ఏసీబీ దూకుడు

మాజీ ఎండీ రామ్ చందర్ నాయక్.. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాజీ ఓఎస్డీ కళ్యాణ్ కుమార్‌లను మూడు రోజులపాటు ఏసీబీ కస్టడీకి కోర్టు అనుమతించింది.దీంతో ఏసీబీ అధికారులు సోమవారం నుంచి మూడు రోజుల పాటు రామ్ చందర్ నాయక్, కళ్యాణ్‌లను కస్టడీ విచారణ చేయనున్నారు. గొర్రెల స్కామ్‌లో ఇప్పటికే 10 మందిని నిందితులుగా గుర్తించి పలువురిని అరెస్ట్ చేశారు. గొర్రెల స్కామ్‌లో మొదట రూ. 2.10 కోట్లు దారి మళ్ళినట్టు గుర్తించారు. పశు సంవర్ధక శాఖ మాజీ డైరెక్టర్ రామ్ చందర్ నాయక్ , ఓఎస్డీ కళ్యాణ్ అరెస్ట్‌తో రూ.700 కోట్ల స్కామ్ జరిగినట్లు ఏసీబీ గుర్తించింది.

సంపాదకీయం

# తెలుగు మంత్రులకు పరీక్షా కాలం !

ఉభయ తెలుగు రాష్ట్రాలకు ఐదు మంత్రి పదవులు దక్కాయి. ఈ ఐదుగురు ఉమ్మడిగా తెలుగు రాష్ట్రాల సమస్యలకు మేలు జరిగేలా చూడాలి. ఎపికి చెందిన టిడిపి మంత్రులు ఎపి సమస్యలపై నిలదీసేందుకు వెనకాడక పోవచ్చు. అలాగే సమస్యలు ప్రస్తావిస్తామని, తమ పదవులను ఎపి ప్రయోజనాలకోసం వినియోగిస్తామని కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్‌లు ప్రకటించారు. వారికి సమస్యల పట్ల చిత్తశుద్ధి ఉంది. ఎపిని బాగుచేసుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. అమరావతి, పోలవరం, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ, రైల్వేజోన్ వంటివి వారి ఎజెండాలో ఉన్నాయి. తెలంగాణలో కూడా అలాంటి సమస్యలు పరిష్కరిం చేందుకు ఎజెండాను తయారు చేసుకునే పనిలో ఇక్కడి మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు ముందుండాలి. తెలంగాణ కోసం లక్షలకోట్లు ఇచ్చామని కాకమ్మకబుర్లు చెబితే ప్రజలు ఇకముందు నమ్మరు. తెలంగాణలో కూడా ఇద్దరు మంత్రులు కొంతకాలం రాజకీయాలను పక్కన పెట్టాలి. అదేపనిగా ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే ఎజెండాను పక్కన పెట్టాలి. రాష్ట్ర ప్రభుత్వంతో కలసి సమస్యల కోసం పోరాడాలి. ఇక్కడ ఏ మేలు జరిగినా ప్రజలకే అన్న భావనలో ముందుకు సాగాలి. తమ రాజకీయాల కోసం ప్రజల సమస్యలను పక్కన పెట్టే ప్రయత్నాలు ఇకనుంచి నడవకుండా చూసుకోవాలి. అన్నింటికి మించి చంద్రబాబు, పవన్ కళ్యాణ్÷–లకు ఎపి సమస్యలపై కొంత డిమాండ్ చేసే పరిస్థితి వచ్చింది. మోడీ బలం కూడా అంతంత మాత్రమే ఉంది. ఈ క్రమంలో దేశం ఎదుర్కొంటున్న ,ముఖ్యంగా ఎపి విభజన సమస్యల పై చర్చల ద్వారా సాధించాకోవాల్సింది చాలా ఉంది. ప్రధాని మోడీ కూడా గతంలోగా కాకుండా కొంత ఉదారంగా వ్యవహరించి ప్రజల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ఇకనుంచైనా సహచరులు, మంత్రులు చెప్పే సమస్యలను పరిష్కరించే లక్ష్యం దిశగా పనిచేయాలి. రాజకీయాల్లో కూడా అప్పుడప్పుడు వాతావరణ సమతుల్యత కనిపిస్తుందనడానికి ఇటీవలి ఫలితాలను బేరీజు వేసుకోవచ్చు. ప్రకృతి ప్రమేయం ఇక్కడా కనిపించడం గమనించవచ్చు. తనకు తిరుగులేదనుకున్న వైకాపాను తిరుగుటపా కట్టించిన తీరు చూశాం. 151 సీట్లలో మధ్యలో ఉన్న ఐదును లాగేసుకోవడంతో ఆ పార్టీ 11కు పరిమితం అయ్యింది. తాను అంతా మంచే చేశానని, డబ్బుల పందేరం చేశానని జగన్ వగచినా.. జనం నమ్మలేదు. పాలన అంటే డబ్బులు పంచే కార్యక్రమం కాదని జగన్ ఆత్మపరిశీలన చేసుకోవాలి. చంద్రబాబు కూడా ఇలాంటి ప్రయత్నాల జోలికి పోకుండా రాష్ట్రాన్ని గాడిలో పెట్టే పనిలో పడాలి. అంతుక ముందు తనకు తిరుగు లేదన్న బిఆర్ఎస్ అధికారం ఊడబెరికి అవతల పెట్టారు. అయినా ఇంకా ఎగిరెగిరి పడడం చూసి సహించలేని ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో ఉన్న కోరలను కూడా పీకేశారు. ఇది చాలు..వారి నిర్వాకానికి. అన్నీ తప్పులు చేసి, అప్పులు చేసి, అదే అభివృద్ధి, అదే పాలన అని చెప్పిన జగన్, కెసిఆర్‌లకు ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పారు. ఇరు తెలుగు రాష్ట్రాల్లో ఓ రకంగా ప్రకృతి న్యాయం చేసిందనే భావించాలి. ఇది అందరికీ గుణపాఠం కావాలి. అలాగే మోడీని కూడా 240 సీట్లకు పరిమితం చేశారు. ప్రజాస్వామ్యం కలిసి ఉమ్మడి నిర్ణయాలు తీసుకోవల్సి ఉంది. ఇప్పుడు మోడీ కావచ్చు..జగన్ కావచ్చు..రేవంత్ కావచ్చు...ప్రజలను దృష్టి పెట్టుకుని నిర్ణయాలతో ముందుకు సాగాలి. దేశ రాజకీయాలకు సంబంధించి, ఆంధ్రప్రదేశ్ పరిణామాలు, ఆంధ్రప్రదేశ్ తీర్పు ఒక గొప్ప గుణపాఠం అన్నది గుర్తించాలి. మోదీ అనుకున్నట్లుగా నాలుగు వందల సీట్లు సాధించివుంటే ఆయనకు పట్టపగ్గాలు ఉండేవి కావు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి విజయం సాధించినా, చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ల పాత్ర రాష్ట్రం వరకే పరిమితమై ఉండేది. దుష్పరిపాలన అంతం అయిందని ప్రజలు భావించేవారు. రాజధాని మొదలైన అభివృద్ధి సమస్యల పరిష్కారం కోసం యధావిధిగా చంద్రబాబు కేంద్రం చుట్టూ తిరగాల్సి వచ్చేది. భేతాళ కథల్లాగా అలుపెరగకుండా చంద్రబాబు పర్యటనలకే పరిమితం అయ్యేవారు. అయితే ఇప్పుడా పరిస్థితి లేనందుకు సంతోషించాలి. ఇప్పుడున్న ఇద్దరు మంత్రులు గట్టిగా పోరాటం చేయాల్సిందే. చంద్రబాబు కూడా నాన్చివేత ధోరణని ప్రదర్శించకుండా నిక్కచ్చిగా నిలదీయగలగాలి. అసెంబ్లీ విజయం కంటె లోక్‌సభకు తెలుగుదేశం నుంచి గెలిచిన సభ్యుల సంఖ్యకు అధిక ప్రాధాన్యం ఏర్పడిందన్న విషయం ఎప్పుడూ గుర్తించి ముందుకు సాగాలి. మోడీ కూడా తనకు సీట్లు తక్కువ ఉన్నాయనే భావంతో పనుల్లో జోరు పెంచాలి. విపక్షాలకు గౌవరం ఇవ్వాలి. పార్లమెంట్ ప్రజల సమస్యలకు వేదికగా మారాలి. మోదీకి పూర్తి మెజారిటీ వచ్చి ఉంటే, చంద్రబాబు ప్రాధాన్యం అత్యంత పరిమితంగా ఉండేది. తెలుగుదేశం బలగం మోదీ ప్రభుత్వ మనుగడకే కీలకం కావడంతో, ఇప్పుడు చంద్రబాబు ప్రపంచం దృష్టిని ఆకర్షించారు. బీజేపీ ప్రభుత్వం దూకుడుకు ఈ రెండు పార్టీలు క్లళెం వేస్తాయని, వేయాలని దేశంలోని వివిధ వర్గాలు కూడా ఆశిస్తున్నాయి. ఎపికి సంబంధించి గౌరవం ఇచ్చి, అభివృద్ధికి ఆసరా ఇచ్చినంత కాలం చంద్రబాబు మిత్రధర్మానికే కట్టుబడి ఉండవచ్చు. లేకుంటే ప్రత్యామ్నాయం కూడా వెంటనే ఉంది. అవతల ఇండియా కూటమి కూడా బలంగానే ఉందన్న విషయం గమనించి దేశం కోసం మోడీ నిజంగానే కష్టపడాలి. ఇంతకాలం చేసిన ప్రచారార్భాటాలు పక్కన పెట్టాలి. ఏకపక్ష పాలనకు, సంకీర్ణ భాగస్వామ్యపాలనకు తేడా ఇప్పుడు ప్రజలు కూడా గమనిస్తుంటారు. ఎవరు కట్టు తప్పినా ప్రజలు చూస్తూనే ఉంటారు. ఒకే దేశం ఒకే నాయకుడు అని భ్రమిస్తే మోడీ మూల్యం చెల్లించుకోక తప్పదు. ఇండియా కూటమి అప్రమత్తంగా ఉన్నంత కాలం, బీజేపీ మీద ఆ ఒత్తిడి పనిచేస్తూనే ఉంటుంది. పాలక కూటముల మధ్య పోటీ వల్ల కూడా ప్రజాప్రయోజనాలకు ప్రాధాన్యం పెరుగుతుంది. మిత్ర పక్షాలన్నిటి నుంచి ఒత్తిడిని తప్పించుకోవడానికి బీజేపీ ఇతర మార్గాల ద్వారా తన బలాన్ని పెంచుకునే ప్రయత్నాల్లో ఉంటుంది. ఏ పార్టీని, చీల్చుదామా అని అన్వేషిస్తుంటుంది. అందువల్ల అన్ని పార్టీలు కూడా జాగ్రత్తగా ఉండాల్సిందే. ప్రధాని పదవికి కూడా మచ్చతెచ్చే విధంగా సాగిన విద్వేష ప్రచారాన్ని ఈ ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించారు. అందువల్ల మోడీ కూడా జాగ్రత్తగా ఐదేళ్లు పాలించి మంచి పేరు తెచ్చుకోవాల్సి ఉంది. అభివృద్ధి ఎజెండగా సాగినంత కాలం ప్రజలు నిరంతరంగా అండగా ఉంటారని గుర్తించి మసలుకోవాలి. నంబర్ గేమ్ కోసం వెంపర్లాడే పనలకు కొంతకాలం విరామం ఇవ్వాలి. ప్రధాని వద్ద సమస్యలను ప్రస్తావించడంలో మంత్రులు నిర్భయంగా ముందుకు సాగాలి. ఈ విషయంలో భయంతో వెళితే సమస్యలు పరిష్కారానికి నోచుకోవని గుర్తించాలి. ముఖ్యంగా బిజెపి మంత్రులు ఇది బాగా గుర్తించాలి.

## అసమాన వ్యంగ్య చిత్ర కారుడు అబూ అబ్రహాం

**జూన్ 11, అబూ అబ్రహాం జయంతి**





రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

రాజకీయ కార్టూనులు వేస్తూ, ప్రముఖ వార్తా పత్రికలలో పనిచేస్తూ, అదే వృత్తిగా ఎంచుకుని, స్వతంత్రంగా, నిర్భీతిగా పని చేసిన వ్యంగ్య చిత్రకారులు అతి కొద్దిమంది మాత్రమే ఉన్నారు. అందులో అబూ అబ్రహం ముఖ్యులు.

ఒక కార్టూనులో ఒక పాత్రను ప్రవేశపెట్టి, ఆ పాత్రబొమ్మను అదేవిధంగా దశాబ్దాల పాటు వేయగల శక్తి ఉన్న అతి కొద్దిమంది కార్టూనిస్టులలో అబూ ఒకరు. 150 సంవత్సరాల చరిత్ర కలిగిన ప్రముఖ అబ్జర్వర్ పత్రికకు అబూనే మొట్ట మొదటి రాజకీయ వ్యంగ్య చిత్రకారుడు కావడం విశేషం. సామాన్యంగా ఇంట గెలిచి రచ్చ గెలవడం కాకుండా, అబూ అబ్రహం బయటి దేశాలలో పేరు ప్రఖ్యాతులు సంపాదించి, భారత్ కు తిరిగి రావటం జరిగింది. పువ్వు పుట్టగానే పరిమళిస్తుందని తన మూడవ ఏట నుండే బొమ్మలు గీయటం మొదలు పెట్టారు. చదువుకునే రోజులలో తమ గురువుల బొమ్మలు కూడా వేసే వారట.

అత్తుపురథు మాథ్యూ అబ్రహామ్ (11 జూన్ 1924 %–% 1 డిసెంబర్ 2002), అంతర్జాతీయ గుర్తింపు పొందిన ప్రఖ్యాత భారతీయ వ్యంగ్య చిత్రకారుడు, పాత్రికేయుడు, రచయిత. ఆయన కలం పేరు అబూ. ఆయన హేతువాది, నాస్తికుడు.

అబూ తన 40 యేళ్ల సుదీర్ఘ వృత్తి జీవితంలో అనేక జాతీయ, అంతర్జాతీయ వార్తా పత్రికలలో పనిచేశారు. "బాంబే క్రానికల్", "శంకర్స్ వీక్లీ", "బ్లిట్జ్", "ట్రిబ్యూన్", "ది అబ్జర్వర్", "ది గార్డియన్", "ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్" తదితర పత్రికలలో పని చేసి గుర్తింపు పొందారు.

అబూ కేరళ రాష్ట్రంలోని మవేలికర గ్రామంలో ఎ.ఎం.మాథ్యూ, కాంతమ్మ దంపతులకు జన్మించారు. తన మూడవ యేటి నుండే బొమ్మలు గీయడం మొదలు పెట్టారు. తిరువనంత పురం యూనివర్సిటీ కాలేజీలో ఫ్రెంచి, గణితం, ఇంగ్లీషు ఐచ్ఛికాంశాలుగా 1945లో డిగ్రీ పూర్తి చేశారు. ఇతడు విద్యార్థి దశలో టెన్నీస్ ఛాంపియన్‌గా ఉండేవారు. చదువు ముగిసిన వెంటనే అబూ బొంబాయి వెళ్లి "బాంబే క్రానికల్" పత్రికలోను, దాని సోదర పత్రిక "ది బాంబే సెంటినెల్"లోను జర్నలిస్ట్‌గా చేరారు. "బ్లిట్జ్", "భారత్" పత్రికలలో కార్టూన్లు గీయడం మొదలు పెట్టారు. 1951లో ప్రముఖ కార్టూనిస్ట్ కె.శంకర్ పిళ్ళై అబూను తన "శంకర్స్ వీక్లీ"లో పనిచేయ వలసిందిగా ఢిల్లీకి ఆహ్వానించారు.

1953లో లండన్‌లోని "ది స్టార్" పత్రిక సంపాదకుడు ఫ్రెడ్ జోన్ ఇతడిని లండన్‌కు రావలసినదిగా ప్రోత్సహించారు. ఆయన తన 32వ యేట లండన్‌లో అడుగు పెట్టారు. లండన్ చేరిన వెంటనే అబూ పంచ్, డైలీ స్కెచ్, ఎవెరీబడీస్ లండన్ ఒపినియన్, ఈస్టర్న్ వరల్డ్ మొదలైన పత్రికలకు అబ్రహాం అనే కలం పేరుతో కార్టూన్లు వేయడం ఆరంభించారు. 1956లో ట్రిబ్యూన్ పత్రికలో ప్రచురింపబడ్డ ఇతని రెండు కార్టూన్లను చూసి ప్రపంచంలో అతి పురాతనమైన ఆదివారం వార్తాపత్రిక "ది అబ్జర్వర్" సంపాదకుడు డేవిడ్ ఏస్టర్ ఆయనకు తన పత్రికలో రాజకీయ కార్టూనిస్టుగా స్థిరమైన ఉద్యోగాన్ని ఇచ్చారు. ఆయన సలహాపై అబ్రహాం అనే కలం పేరును తన చిన్ననాటి ముద్దుపేరు "అబూ"గా మార్చుకున్నారు.

అబూ బ్రిటిష్ సంస్కృతిలో మునిగి పోయి వాడి, వేడి రాజకీయ కార్టూన్లను గీశారు. ది గార్డియన్ పత్రిక అబును "త్రికరణ శుద్ధిగా వామపక్ష భావ జాలాన్ని నమ్మి ప్రభుత్వానికి పక్కలో బల్లెంలా తయారైనాడని" అభివర్ణించింది. 1962లో శాతం క్యూబాలో చేగువేరా చిత్రాన్ని గీశారు.

1966 సెప్టెంబరులో అబూ ది గార్డియన్ పత్రికలో చేరారు. ట్రిబ్యూన్ పత్రికకు వారం వారం కార్టూన్లను వేశారు. 1968లో వియత్నాం యుద్ధంపై వెలువడిన "వర్డిక్ట్స్ ఆఫ్ వియత్నాం" అనే కార్టూన్ల సంకలనానికి సంపాదకత్వం వహించారు.

అబూ 1969లో భారత దేశానికి తిరిగి వచ్చారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికలో 1981 వరకు రాజకీయ కార్టూనిస్టుగా పనిచేశారు. 1970లో ఆయన తీసిన షార్ట్ ఫిలిం నో ఆర్క్ కు బ్రిటిష్ ఫిలిం ఇన్స్టిట్యూట్ ప్రత్యేక అవార్డును ఇచ్చింది. 1972–78ల మధ్య ఇతడు రాజ్యసభలో నామినేట్ సభ్యుడిగా ఉన్నారు.

1975లో భారత అత్యవసర స్థితి విధించినపుడు పత్రికా స్వేచ్ఛను రద్దు చేశారు. అబూ ఈ చర్యతో ఇందిరా గాంధీ పై ఉన్న అభిమానాన్ని కోల్పోయారు. పత్రికా రంగంలో పని చేసే వారు కొంత మంది, ఎమర్జెన్సీ రోజులలో వంగమంటే, నేలన పడి పాకారని ఒక అపప్రథ ఉన్నది. అటువంటి చెడ్డపేరు, అబూ అబ్రహంకు గాని ఆయన పని చేసిన ఇండియన్ ఎక్సుప్రేస్సుకు గాని రాలేదు. ఆయన ధైర్యంగా ఉండి తన కార్టూన్లను తాను వేస్తూ, సెన్సార్ అధికారులకు అందకుండా, చాలా తెలివిగా కార్టూన్లు గీసి నెగ్గుకు వచ్చారు. ధైర్యం, నిబద్ధత ఉంటే ఎంతటి నియంత అయినా ఏమీ చెయ్యలేదని నిరూపించారు. 1977లో ఎమర్జెన్సీ సమయంలో ప్రచురించ లేక పోయిన రాజకీయ కార్టూన్లు, వ్యాసాలతో "గేమ్స్ ఆఫ్ ఎమర్జెన్సీ" అనే పుస్తకాన్ని విడుదల చేశారు. ఇంకా ఇతడు "అబూ ఆన్ బాంగ్లాదేశ్", "ప్రైవేట్ వ్యూ", "అరైవల్స్ అండ్ డిపార్చర్స్" అనే కార్టున్ పుస్తకాలను ప్రకటించారు. 1988లో వెలువడిన పెంగ్విన్ బుక్ ఆఫ్ ఇండియన్ కార్టూన్స్‌కు సంపాదకుడిగా ఉన్నారు.

1981 నుండి అబూ ఫ్రీలాన్సర్‌గా వివిధ వార్తా పత్రికలకు కార్టూన్లు గీయడం ప్రారంభించారు. "సాల్ట్ అండ్ పెప్పర్" అనే స్ట్రిప్ కార్టూన్ వేయ నారంభించారు.

ఎంతో మందిని తన భావ యుక్తమైన కార్టూన్లతో కదిలించిన, ఈ ప్రముఖ వ్యంగ్య చిత్రకారుడు, 2002 సంవత్సరం డిసెంబరు 1 వ తేదీ మరణించారు. ఆయన మరణానికి సంతాప సూచకంగా రాజ్యసభ రెండు నిమిషాల మౌనం పాటించింది. అబూ అంత్యక్రియలను ప్రభుత్వ లాంచనాలతో ఘనంగా నిర్వహించారు.

## అమరావతికి మళ్లీ జీవకళ

### చెత్తా చెదారం తొలగింపు ప్రక్రియ

### రాజధాని ప్రాంతంలో మళ్లీ కార్యకలాపాలు



అమరావతి, జూన్ 10 (ప్రజామంటలు): అమరావతికి మళ్లీ జీవం వచ్చింది. ఈ ప్రాంతం కళకళలాడబోతున్నది. భూములు ఇచ్చిన రైతులు కూడా ఆనందంగా ఉన్నారు. అమరావతి నిర్మాణం కోసం చంద్రబాబు ఇక తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఆగిపోయిన పనులను పరుగెత్తించగలరన్న విశ్వాసంలో ప్రజలు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పడబోతున్న తరుణంలో రాజధాని అమరావతి కళకళలాడుతోంది. వంద పొక్లయిన్‌లు, వందల మంది కార్మికులు, రాత్రి పగలు సాగుతున్న పనులతో ఇప్పుడు అమరావతికి పునర్వైభవం వస్తోంది. ఐదేళ్లుగా పేరుకుపోయిన చెత్తను అధికారులు తొలగిస్తున్నారు. చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వం రెండు రోజుల్లో కొలువు దీరనుంది. ఈ లోపు అక్కడ ఉన్న పరిస్థితిపై నివేదిక ఇచ్చేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. మూడు రాజధానుల పేరుతో అమరావతి ప్రాంతాన్ని వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. దీంతో కంప చెట్లు పేరుకుపోయాయి. ఆ ప్రాంతమంతా అడవిని తలపించింది. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో అక్కడ మళ్లీ కార్యాచరణ మొదలయ్యాయి. సీఎస్‌గా నీరబ్‌కుమార్ పగ్గాలు చెపట్టిన తర్వాత అమరావతిలో పనులు ప్రారంభమయ్యాయి. మూడు నాలుగు రోజుల నుంచి అమరావతిలో ముళ్లకంపను తొలించే పని చేస్తున్నారు. 25 ప్రాంతాల్లో వందకుపైగా కిలోమీటర్ల పరిధిలో పనులు చేపట్టారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారం నాటికి అమరావతిలో పనులు పూర్తి చేయాలన్న సంకల్పంతో అధికారులు చర్యలు చేపట్టారు. ఈ పనులను నీరబ్ కుమార్ స్వయంగా పరిశీలించారు. అమరావతిలో పనులు జరుగుతున్న ప్రాంతంలో పర్యటించిన సీఎస్ నీరబ్ కుమార్... అక్కడ అధికారులతో మాట్లాడారు. సుమారు రెండు మూడు గంటలు ఆ ప్రాంతంలో గడిపిన ఆయన.. జరుగుతున్న పనులు పరిశీలించారు. రోడ్లను కూడా పరిశీలించారు. రాజధాని కోసం శంకుస్థాపన జరిగిన ప్రాంతాన్ని కూడా చూశారు. చాలా రోజుల తర్వాత ఉన్నతాధికారులు తమ ప్రాంతానికి రావడంపై రాజధాని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు ఆదేశాలతో అమరావతిలో పనులు చేపట్టారు. మొదటి దశలో పిచ్చిమొక్కులు తొలగిస్తున్నామని తర్వాత సమీక్షించి అక్కడ పనులు పురోగతిపై నివేదిక ఇస్తామన్నారు. అమరావతి ప్రాంతంలో జరిగిన చోరీలపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. రైతుల కౌలు అంశంపై కూడా త్వరగానే నిర్ణయం తీసుకుంటామని చెబుతామన్నారు. మరోవైపు 12న ప్రమాణ స్వీకారం చేయనున్న చంద్రబాబుకు అమరావతిపై సమగ్రమైన నివేదిక ఇచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటి వరకు ఉన్న కట్టడాల పటిష్టతపై ఆరా తీయనున్నారు. దీని కోసం ఓ కమిటీ ఏర్పాటు చేయబోతున్నట్టు సమాచారం అందుతోంది. వీలైనంత త్వరగా కమిటీ రిపోర్టు ఇచ్చేలా చేసి రాజధాని పనులు త్వరితగతిన చేపట్టాలని భావిస్తున్నారు. ఇప్పటి వరకు వేసిన రహదారులు పూర్తిగా పాడైపోయాయి. విద్యుత్ దీపాలు వెలగడం లేదు. వాటిని పునరుద్ధరించారు. రహదారులను కూడా మరోసారి సరిచేయాలి. వీటన్నింటికి చాలా సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు.ప్రస్తుతం జరుగుతున్న పనులతో రాజధాని ప్రాంతంలో జనాల రాకపోకలు కనిపిస్తున్నాయి.

## భైరాన్‌పల్లిలో పురాతన శిలా విగ్రహం గుర్తింపు

సిద్దిపేట,జూన్10((ప్రజామంటలు): దూల్మిట్ట మండలంలోని భైరాన్ పల్లిలో పురాతన శిల బయటపడింది. గ్రామంలోని పురాతన జైన ఆలయం ఆవరణలో గ్రామస్థులు ఈ శిలను గుర్తించారు. స్థానికంగా అంగడి వీరన్న శివాలయంగా పిలిచే ఈ ఆలయం ఆవరణలో ఇటీవలి వర్షాలకు చిన్న గుంత ఏర్పడింది. అందులో ఈ శిలను గుర్తించి బయటకు తీసినట్లు గ్రామస్థులు తెలిపారు. దీనిపై పురావస్తు శాఖకు సమాచారం ఇవ్వగా.. గ్రామానికి చేరుకున్న అధికారులు ఆ శిలను పరిశీలించి అది చాళుక్యుల కాలం నాటిదని వెల్లడించారు. పురావస్తు శాఖ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ తాజాగా బయటపడ్డ ఈ శిల జైన చౌముఖి శిల్పం అని, 5 అడుగుల ఎత్తుతో చెక్కారని చెప్పారు. నలువైపులా ఉన్న శిల్పాలు 24వ జైన తీర్థంకరుడు మహా వీరుడి ధ్యానం చేస్తున్న చిత్రాలని వివరించారు. గతంలో ఈ తరహా శిల్పాలను కొలనుపాక, వేములవాడలో గుర్తించామని చెప్పారు. జైనులు వీటిని 'సర్వతోభద్ర' అంటూ వ్యవహరిస్తారని తెలిపారు. ఈ శిల్పాలు లభించిన ప్రాంతాలు గతంలో జైనధర్మ కేంద్రాలుగా విరాజిల్లాయని వివరించారు. బౌద్ధుల తరహాలోనే జైనులు కూడా స్తూపాలు, చైత్యాలు నిర్మించుకునేవారని, గ్రామంలోని అంగడి వీరన్న శివాలయం ముందున్న శాసనాల ద్వారా తెలుస్తోందని శ్రీనివాస్ చెప్పారు.

## కవిత్వం

### రామోయిజం..

ఏ గురువూ లేని ఆ శిష్యుడికి
లోకమే సరైన
పాఠశాలయింది..
శిల్పి అతడే శిల అతడే!
సంకల్ప ఉలితో అణువణువు
దిద్దుకొని అవకాశాల ఆకాశాన్ని
అందుకొని దార్శనికుడయ్యేడు!
పత్రికలు సినిమాలు
వ్యాపారాలు
పెద్ద మర్రిచెట్టయి విస్తరించి..
పదుగురూ మెచ్చేలా
కొలువులిచ్చి..
అభినవ కృష్ణదేవరాయులై
కళలన్నీ కళకళలాడేలా కాపు
కాచేడు
నిజమే తన ఇజంగా
అక్షరంలో రెప రెప లాడుతూ
నిత్య సత్యంలా వెలిగేడు!
అఖిలాంధ్రుల గుండె చప్పుడు
తానే అయి అన్యాయాలకు
ఎదురునిల్చి పోరాడుతూ
ప్రజల్ని రాజకీయ సామాజిక
చైతన్య వంతుల్ని చేస్తూనే
రవిలా అస్తమయం చెందేడు..!!
(శ్రీ రామోజీరావుకి నివాళి )

భీమవరపు పురుషోత్తమ్
రాజమండ్రి
సెల్:9949800253

# 5కోట్ల భూమికి ఉద్యోగుల ఎసరు

## ప్రైవేట్ వ్యక్తులకు పట్టాలు చేసిన ఘనుల

## పోలీసులకు ఫిర్యాదుతో వెలుగులోకి ఘటన

హైదరాబాద్,జూన్10 (ప్రజామంటలు):
మణికొండ పోకలవాడలో భారీ భూదందా వెలుగలోకి వచ్చింది. ధరణి పోర్టల్‌లో గోల్మాల్ చేసి కోట్లు విలువ చేసే ల్యాండ్ ను కబ్జా చేశారు. కలెక్టర్లు ఎలక్షన్ హడావిడిలో ఉండగా ధరణిలో పాస్ బుక్కులు జారీ చేశారు. రంగారెడ్డి జిల్లా ఇద్దరు కలెక్టర్లు సంతకాలతో పాస్ బుక్కులు జారీ అయ్యాయి. 5 ఎకరాలు ల్యాండ్ కోసం 3 కోట్లు డీల్ చేశారు. ఉద్యోగులు కొంత డబ్బు తీసుకున్న తర్వాత కలెక్టర్ల సంతకాలతో పాస్ బుక్కులు జారీ అయ్యాయి. బ్లాక్ లిస్టులో ఉన్న ల్యాండ్ కు పాసు బుక్కులు జారీ కావడంతో ఎమ్మార్వో కంగుతున్నారు. దీనిపై పోలీసులకు ఎమ్మార్వో ఫిర్యాదు చేయడంతో ఈ దందా వెలుగులోకి వచ్చింది. ఇద్దరు ధరణి ఉద్యోగులతో పాటు మరో 8 మందిని సైబరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. అంతేకాకుండా ల్యాండ్ ను తమ పేరుపై రిజిస్టర్ చేసుకున్న ఇద్దరు రియల్ ఎస్టేట్ వ్యాపారులను కూడా పోలీసులు అదుపులోకి



# సిక్కిం సీఎంగా తమాంగ్ ప్రమాణం

గ్యాంగ్‌టెక్ (ప్రజామంటలు):



సిక్కిం రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రేమ సింగ్ తమాంగ్ సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాజధాని గంగ్‌టాక్‌లోని పల్జోర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో తమాంగ్ చేత ఆ రాష్ట్ర గవర్నర్ లక్ష్మణ ప్రసాద్ ఆచార్య ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయించారు. దీంతో తమాంగ్ వరుసగా రెండో సారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఏప్రిల్ 19వ తేదీన 32 స్థానాలున్న సిక్కిం రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరిగాయి. వాటి ఫలితాలు జూన్ 4వ తేదీన వెలువడ్డాయి. ఈ ఫలితాల్లో ప్రేమ సింగ్ తమాంగ్ సారథ్యంలోని సిక్కిం క్రాంతికారి మోర్చ పార్టీ 31 స్థానాలను కైవసం చేసుకుంది. అయితే ఆ రాష్ట్రాన్ని గత 25 ఏళ్లుగా సిక్కిం డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎస్‌డీఎఫ్) పాలిస్తూ వచ్చింది. కానీ 2019 ఎన్నికల్లో సిక్కిం క్రాంతికారి మోర్చ పార్టీ ఘన విజయం సాధించింది. దీంతో ఆ రాష్ట్ర సీఎంగా ప్రేమ సింగ్ తమాంగ్ బాధ్యతలు చేపట్టారు. తాజాగా జరిగిన ఎన్నికల్లో సైతం సిక్కిం ఓటర్లు.. తమాంగ్ పార్టీకే పట్టం కట్టారు. దాంతో ఆయన మళ్లీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. సీఎం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి పార్టీ ఎమ్మెల్యేలు, ప్రముఖులతోపాటు ఉన్నతాధికారులు సైతం హాజరయ్యారు.

# అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ జస్టిస్ లో శిక్షణకై దరఖాస్తుల ఆహ్వానం

## కె. రాజ్ కుమార్, జిల్లా షెడ్యూల్డు కులముల అభివృద్ధి అధికారి

జగిత్యాల జూన్ 10 (ప్రజామంటలు):
అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ జస్టిస్ లో (03) సంవత్సరముల శిక్షణ పొందుటకు గాను 2024-25 సంవత్సరములో (08) మంది షెడ్యూల్డ్ కులముల లా-పట్టబద్రులను ఎంపిక చేయుట కొరకు పూర్వపు కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్, రాజన్న సిరిసిల్లా, పెద్దపల్లి మరియు జగిత్యాల ప్రస్తుత జిల్లాల నివాసులైన షెడ్యూల్డ్ కులములకు చెందిన అర్హత గల లా-పట్టబద్రుల నుండి దరఖాస్తులు తేది: 06-06-2024 నుండి 06-07-2024 వరకు ఆన్ లైన్లో (ఇ- 2 3 ?) website https://telanganaepass.cgg.gov.in% . అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ జస్టిస్ లో (03) సంవత్సరములు శిక్షణ పొందుటకు ఎంపిక చేయబడిన లా-పట్టబద్రులకు నెలకు ఒక్కరికి రూ.లు 3000 స్టైపండ్, పుస్తకములు మరియు ఫర్నీచర్ కొరకు రూ.లు 50,000 మంజూరు చేయబడును.

**షెడ్యూల్ క్రమం, వివరములు, తేదీలు:**
ఆన్ లైన్ ధరఖాస్తు చేసుకొనుటకు ప్రారంభపు తేది: 06-06-2024
ఆన్ లైన్ దరఖాస్తు చేసుకొనుటకు చివరి తేది: 30-07-2024
అభ్యర్థుల ఎంపిక తేది: 15-07-2024

**నిబంధనలు:**
1. షెడ్యూల్డ్ కులములకు చెందిన వారు బార్ కౌన్సిల్ లో సభ్యత్వం పొంది (02) సంవత్సరముల నుండి (04) సంవత్సరములు అయివుండాలి. 2. 1 జూలై 2024 నాటికి (23) సంవత్సరముల నుండి (35) సంవత్సరముల లోపు వయస్సు కలిగి వుండాలి. 3. సంవత్సర ఆదాయం రూ. 2,00,000 లకు మించరాదు. 4. జతపర్చవల్సినవి (కులము సర్టిఫికేట్, ఆదాయము సర్టిఫికేట్, గ్రాడ్యులేషన్ లా సర్టిఫికేట్, బార్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, ఆధార్ కార్డ్ మరియు బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్ జీరాక్స్ కాపీ), 5. ఇతర వివరములకై ఆయా జిల్లాలలోని సంబంధిత షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి కార్యాలయం నందు సంప్రదించగలరు.

# బస్సుపై దాడి మా పనే..

ప్రకటించుకుంది. అంతేకాకుండా ఇటువంటి మరిన్ని దాడులకు పాల్పడతామని హెచ్చరించింది. ప్రధానమంత్రిగా మూడోసారి మోదీ ప్రమాణ స్వీకారం చేసే రోజే ఈ దాడి జరగడం గమనార్హం. శివఖోరి ఆలయం నుంచి కట్రాలోని మాతా వైష్ణోదేవీ ఆలయానికి వెళ్తోన్న బస్సుపై ఉగ్రవాదులు ఆదివారం మెరుపుదాడి చేశారు. డ్రైవర్‌కు బులలెట్ తాకడంతో వాహనం అదుపు తప్పి పక్కనే ఉన్న లోయలో పడిపోయింది. ఈ ఘటనలో 9 మంది మరణించగా.. 33 మంది గాయపడ్డారు. డ్రైవర్‌తో సహా కండక్టర్ కూడా మరణించినట్లు అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో ప్రాణాలతో బయటపడిన బాధితులు ఆ భయానక క్షణాలను గుర్తుచేసుకున్నారు. ముఖాలకు మాస్కులు పెట్టుకొని ఉన్న ఆరు లేదా ఏడుగురు ఉగ్రవాదులు బస్సుపై కాల్పులకు తెగబడ్డారు. తొలుత అన్ని వైపులా కాల్పులు జరిపిన ముష్కరులు.. బస్సు లోయలో పడగానే అటుగా వచ్చి మళ్లీ కాల్పులు కొనసాగించారు. ఆ సమయంలో తాము చనిపోయినట్లు నమ్మించేందుకు మౌనంగా ఉండిపోయాం. ఎలాగైనా ఇంటికి తిరిగి వెళ్లడమే ముఖ్యమని అనుకున్నాం. ఓ పది, పదిహేను నిమిషాల తర్వాత స్థానికులు, పోలీసులు వచ్చి మమ్మల్ని కాపాడారు' అని ప్రాణాలతో బయటపడిన పలువురు బాధితులు మీడియాకు వెల్లడించారు. పాకిస్థాన్ ఉగ్రవాదులు ఈ దాడులకు పాల్పడినట్లు పేర్కొన్న నేపథ్యంలో రంగంలోకి దిగిన ఎన్ఐఏ.. స్థానిక పోలీసులతో కలిసి దర్యాప్తు మొదలుపెట్టినట్లు సమాచారం. మరోవైపు హంతకుల వేట కోసం ఆర్మీ, సీఆర్పీఎఫ్, స్థానిక పోలీసులు కలిసి కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. డ్రోన్లతోనూ పరిసర ప్రాంతాల్లో గాలిస్తున్నాయి. రియాసీ, ఉధంపుర్, పూంచ్, రాజౌరీ ప్రాంతాల్లోనే ఈ ఉగ్రమూకలు తలదాచుకున్నట్లు భావిస్తున్నారు. కాగా జమ్మూకశ్మీర్‌లో పర్యటక బస్సుపై జరిగిన ఉగ్ర దాడికి పాల్పడింది తామేనంటూ పాకిస్థాన్ లష్కరే తొయిబాకు చెందిన ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్) ప్రకటించిన సంగతి తెలిసిందే.ఈ దుర్ఘటనలో 9 మంది యాత్రికులు ప్రాణాలు కోల్పోగా.. 30 మందికి పైగా గాయపడ్డారు. ఈ ఉగ్ర ఘటనపై కేంద్రమంత్రి రామదాస్ అథవాలే తీవ్రంగా స్పందించారు. "జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదం అంతమైందని నేను భావిస్తున్నాను. నరేంద్రమోదీ నేతృత్వంలో కేంద్రంలో కొత్త సర్కార్ కొలువుదీరిన సమయంలో.. ఉద్దేశపూర్వకంగా భయాన్ని సృష్టించేందుకు ఈ ఘటనకు పాల్పడ్డారు. ఇలాంటివి తరచూ జరుగుతుంటే.. మనం పాక్‌కు బుద్ధి చెప్పాల్సిందే" అని అథవాలే దాయాది దేశాన్ని ఉద్దేశించి హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం యాత్రికుల బస్సుపై ఉగ్రవాదులు కాల్పులు జరపడంతో అది లోయలో పడింది. ముష్కరులు 25 నుంచి 30 తూటాలను పేల్చారని బాధితులు తెలిపారు. అప్పుడు ఆ వాహనం శివఖోరి ఆలయం నుంచి కట్రాలోని మాతా వైష్ణోదేవీ ఆలయానికి వెళుతోంది. ముఖాలకు మాస్కులు పెట్టుకొని ఉన్న ఆరు లేదా ఏడుగురు ఉగ్రవాదులు బస్సుపై కాల్పులకు తెగబడ్డారని బాధితులు వెల్లడించారు. చనిపోయినట్టు నటించి తాము ప్రాణాలు కాపాడుకున్నామని చెప్పారు. రియాసీ, ఉధంపూర్, పూంచ్, రాజౌరీ ప్రాంతాల్లోనే ఉగ్రవాదులు దాక్కున్నారని భావిస్తున్న బలగాలు.. వారి కోసం కూంబింగ్ ఆపరేషన్ ను నిర్వహిస్తున్నాయి.

# రాజమండ్రి వద్ద పెరుగుతున్న గోదావరి

## శ్రీశైలంలోరి వచ్చి చేరుతున్న వరద



రాజమండ్రి,జూన్10 (ప్రజామంటలు):
రాజమండ్రి వద్ద గోదావరిలో క్రమేపీ నీటిమట్టం పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరిలోకి నీరు చేరడంతో నీటిమట్టం పెరుగుతోంది. ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద 13.79 మీటర్లకు నీటిమట్టం చేరింది.గోదావరి డెల్టాలోని మూడు కాలువలకు బ్యారేజ్ నుండి 8వేల క్యూసెక్కుల సాగు నీరు విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టాకు 2 వేల 500, పశ్చిమ డెల్టాకు 4 వేలు, మధ్య డెల్టాకు 15 వందల క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఎగువ ప్రాంతాల్లో నుండి వస్తున్న నీరు వ్యవసాయ అవసరాల కోసం కాలువలకు విడుదల చేస్తున్నారు. దీనితో బ్యారేజ్ నుండి సముద్రంలోకి ఒక చుక్క నీరు వదలడం లేదు. సాగునీరు వస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు తెలుగు రాష్ట్రాల్లోని ప్రాజెక్టులకు వరద నీరు వచ్చి చేరుతోంది. గోదావరితో పాటు కృష్ణా నదిలోనూ వరద పెరుగుతోంది. టీవల కురిసిన వర్షాల వల్ల జలాశయాలకు వరద నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయానికి వరద నీరు స్వల్పంగా ప్రారంభమైంది. ఎగువ పరివాహక ప్రాంతమైన సుంకేసుల జలాశయం నుంచి 4,052 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలం జలాశయానికి వచ్చి చేరుతోంది. వర్షాల వల్ల ఎగువ ప్రాంతాల నుంచి సుంకేసుల జలాశయంలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండగా.. ఆ నీటిని శ్రీశైలం జలాశయంలోకి విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయాని ఇన్‌ఎ÷-లో 4,052 క్యూసెక్కులు ఉండగా.. దిగువగా నీటిని విడుదల చేయడం లేదు. శ్రీశైలం జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. సోమవారం ఉదయం 6 గంటల సమయానికి 809 అడుగులుగా ఉంది. పూర్తి స్థాయి నీటి నిల్వ 215.8070 టీఎంసీలు కాగా? ప్రస్తుతం 33.7180 టీఎంసీలుగా నమోదైంది.

# చంద్రబాబు ప్రమాణానికి మోడీ హాజరు

## స్పష్టత ఇచ్చిన ప్రధాని కార్యాలయం - అమిత్ షా సహా పలువురు మంత్రులు, సిఎంల రాక



అమరావతి, జూన్ 10 (ప్రజామంటలు):
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు 12వ తేదీన ప్రమాణ స్వీకారం చేస్తున్న క్రమంలో ప్రధాని మోడీ కార్యక్రమానికి హాజరవుతున్నారు. ఈ మేరకు ప్రధాని కార్యాలయం స్పష్టత ఇచ్చింది. ఈ ప్రమాణ స్వీకారానికి దేశంలోని పలు రంగాలకు చెందిన ప్రముఖులు వస్తున్నట్లు సమాచారం. సీఎం ప్రమాణ స్వీకారానికి సంబంధించి గన్నవరం దగ్గరలోని కేసరపల్లిలో శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ ఏర్పాట్లను ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్, ఏపీ టీడీపీ అధ్యక్షుడు అచ్చెంన్నాయుడు పరిశీలిస్తున్నారు.అయితే చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ హాజరవుతారా లేదా అనేది సస్పెన్స్‌గా ఉంది. ఈ సస్పెన్స్‌కు పీఎంఓ తెరదించింది. ప్రధాని మోదీ ఈ కార్యక్రమానికి హాజరవుతారని పీఎంఓ క్లారిటీ ఇచ్చింది. ప్రమాణ స్వీకారానికి మోదీ వస్తున్నారని ఏపీ ప్రభుత్వానికి పీఎంఓ సమాచారం ఇచ్చింది. మాజీ హోంమంత్రి అమిత్ షా కూడా వస్తున్నట్టు చంద్రబాబు పేషీకి అధికారులు సమాచారం ఇచ్చారు. బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రుల హాజరుపై చంద్రబాబు పేషీలోని ఆరా తీస్తునారు. పలువురు కేంద్ర మంత్రులు కూడా ప్రమాణ స్వీకారానికి వస్తామని చంద్రబాబుకు చెప్పినట్టు సమాచారం. గన్నవరం ఎయిర్ పోర్టులో మొత్తం 12 హెలి ప్యాడ్లకు ఏర్పాట్లు చేశారు. ప్రధాని విమానంతో పాటు ఇతరుల విమానాల కోసం కూడా ఎయిర్ పోర్టు ఆధారిటి ఆఫ్ ఇండియా ఏర్పాట్లు చేసింది. వర్షాకాలం కావడంతో ఏర్పాట్లలో జాగ్రత్తగా ఉండాలని సీఎస్ నీరబ్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఎయిర్ పోర్టు నుంచి ప్రమాణ స్వీకారోత్సవ వేదికకు వీఐపీల కాన్వాయి వెళ్లే దారిలో పటిష్ట బందోభస్తు ఏర్పాటు చేశారు. ప్రమాణ స్వీకారోత్సవ ఏర్పాట్లపై ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రమాణ స్వీకార ఏర్పాట్లు, ప్రధాని భద్రత, తదితర విషయాలపై సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ కీలక ఆదేశాలు జారీ చేశారు.

# నితీశ్, బాబులను రెచ్చగొడుతున్న ఇండియాకూటమి

## - మీడియాతో మంత్రి కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ( (ప్రజామంటలు):



బీజేపీలో సంస్థాగతంగా కీలక మార్పులు జరగబోతున్నాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఇంతకాలం పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఉన్న జేపీ నడ్డాను మంత్రివర్గంలోకి తీసుకోవటంతో ఆయన స్థానంలో మరొకరిని తీసుకుంటారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర శాఖకూ కొత్త సారథి నియామకం జరగబోతుందన్నారు. మంత్రివర్గ ప్రమాణస్వీకారం పూర్తయిన నేపథ్యంలో పార్టీ సంస్థాగత మార్పులపై త్వరలోనే కసరత్తు చేసి కొత్తవారిని నియమిస్తారని స్పష్టం చేశారు. ఇండియా కూటమిది దివాళాకోరు రాజకీయమని విమర్శించారు. ప్రధాని ప్రమాణస్వీకారానికి ప్రతిపక్షం రాకపోవడం ఇదే మొదటిసారి అన్నారు. చంద్రబాబు నాయుడు, నితీష్ కుమార్‌ను ఇండియా కూటమి రెచ్చగొడు తుందని కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఎన్నికలకు ముందే చంద్రబాబు, నితీష్‌తో పొత్తు పెట్టుకున్నామని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రమాణానికి ముందు కొత్త కేబినెట్‌కు మోదీ దిశానిర్దేశర చేశారని.. మంత్రులు నడుచుకోవాల్సిన విధానంపై హితబోధ చేశారని కిషన్ రెడ్డి తెలిపారు. మోదీ కేబినెట్‌లో మరోసారి చోటు దక్కడం చాలా సంతోషంగా ఉందని, ఈ సందర్బంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి శుభాకాంక్షలు తెలుపుతున్నానని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన ఢిల్లీలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటిసారిగా కేబినెట్ మంత్రిగా పనిచేశానని, ఇప్పుడు రెండోసారి కేంద్ర మంత్రిగా అవకాశం వచ్చిందని చెప్పారు. కేంద్ర క్యాబినెట్‌లో ఎలాంటి శాఖ ఇచ్చిన సమర్థవంతంగా పనిచేస్తానని స్పష్టం చేశారు. తనను ఎంపీగా గెలిపించిన సికింద్రాబాద్ ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రానికి గతంలో కూడా ఎన్నో ప్రాజెక్టులు తీసుకొచ్చానన్నారు. కొందరు రాజకీయంగా తనను విభేదించి.. కామెంట్లు చేసే మూర్ఖులను అసలు పట్టించుకోనన్నారు. రీజనల్ రింగ్ రోడ్డు టెక్స్‌టైల్ పార్కు, రైల్వే ప్రాజెక్టులు , కేంద్ర సంస్థలు తీసుకొచ్చానని కిషన్ రెడ్డి తెలిపారు.

# ఎన్‌డిఎలో మిత్రపక్షాలకు ప్రాధాన్యం తక్కువే

## అజిత్ పవార్‌కు కేబినేట్ హోదా ఎందకు దక్కలేదు - ఎంపి సుప్రియా సూలే వ్యాఖ్యలు

ముంబయి, జూన్ 10 (ప్రజామంటలు):
ఎన్‌డిఎలో మిత్ర పక్షాలకు సమాన ప్రాధాన్యత ఉండదని ఎన్‌సిపి (శరద్‌పవార్) ఎంపి సుప్రియా సూలే వ్యాఖ్యానించారు. మోడీ నూతన కేబినెట్‌లో అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సిపికి చోటు దక్కకపోవడంపై ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. అజిత్‌పవార్‌కు కేబినెట్ హోదా దక్కకపోవడంలో పెద్ద ఆశ్చర్యమేమీ లేదని, గత పదేళ్లుగా తన మిత్రపక్షాల పట్ల బిజెపి వ్యవహరిస్తున్న తీరును తాను గమనించానని అన్నారు. ఎన్‌డిఎ కూటమిలో వారికి సమాన ప్రాతినిథ్యం ఉండదని విమర్శించారు. తన తండ్రి శరద్ పవార్ స్థాపించిన నేషనల్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) వ్యవస్థాపక దినోత్సవ వేడుకల సందర్భంగా సోమవారం పూణెలో ఆమె మీడియాతో మాట్లాడారు. యుపిఎ ప్రభుత్వ హయాంలో ఎన్‌సిపి మిత్రపక్షంగా పనిచేసింది. మన్మోహన్ సింగ్ ప్రభుత్వం శరద్ పవార్ పట్ల విశ్వాసం, ప్రేమ కనబరిచింది. ఆ సమయంలో పార్టీకి ఎనిమిది లేదా తొమ్మిది మంది ఎంపిలు మాత్రమే ఉన్నప్పటికీ ఆయనకు రెండున్నర మంత్రిత్వ శాఖలను కేటాయించారు' అని అన్నారు. కాంగ్రెస్ ఎంపిల సంఖ్యను పట్టించుకోలేదని, మిత్రపక్షాలకు తగిన గౌరవం కల్పించిందని అన్నారు. మహారాష్ట్రలోని గత మహావికాస్ అఘాడీ ప్రభుత్వంలోనూ అందరూ ఒకరినొకరు గౌరవంగా చూసుకున్నారని అన్నారు. తాము ఏ ఫార్ములాకు కట్టుబడలేదని అన్నారు. కానీ ఎన్‌డిఎ కూటమిలో బిజెపి మిత్ర పక్షాలకు సమాన హోదా కల్పించదని ఎద్దేవా చేశారు. ఎన్‌డిఎ మొదటి కేబినెట్ సమావేశంపై స్పందిస్తూ.. మోడీ ప్రభుత్వం రైతులకు పూర్తి రుణ మాఫీ మంజూరు చేయాలని సూచించారు. రైతులపై ఒత్తిడి లేకుండా రుణమాఫీ ప్రకటించాలని, పాలు, ఉల్లి ధరలపై తగిన నిర్ణయం తీసుకోవాలని అన్నారు.

### యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సజ్జద్ ఆధ్వర్యంలో

## ఘనంగా కవ్వంపెల్లి జన్మదిన వేడుకలు

జమ్మికుంట జూన్ 10 (ప్రజామంటలు): కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మనకొండూరు శాసన సభ్యులు, డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పుట్టిన రోజు సందర్భంగా హుజురాబాద్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ సజ్జద్ ఆధ్వర్యంలో జమ్మికుంట గాంధీ చౌరస్తా వద్ద ఘనంగా కేక్ కట్ చేసి స్వీట్లు, అరటి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా టిపిసిసి సభ్యులు పత్తి కృష్ణ రెడ్డి, జమ్మికుంట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుంకరి రమేష్, మాజీ కౌన్సిలర్ దొడ్డే సదానందం, మహమ్మద్ రంజాన్, వంగ రామకృష్ణ, దొడ్డే నవీన్, కొలుగురి శ్రీనివాస్, యెట్లా అశోక్, పార్లపల్లి నాగరాజు, జునూతుల మారుతి రెడ్డి , మైస సురేష్, రోమాల రాజు, జావిద్, పాతకల అనిల్, అష్రాఫ్, ఎన్.ఎస్.యు.ఐ. జమ్మికుంట మండల అధ్యక్షుడు వాసాల సుధీర్, యూత్ కాంగ్రెస్ నాయకులు జగన్, అరుణ్, సుధాకర్, రాజు, సల్లు బాబా, ఫాయాజ్, అనిల్ వైట్, పుల్ల రవి, అంబాల రాజు, పథకాల సాయి కిరణ్ ఇతర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## అనుమతి లేని పాఠశాలలపై చట్టపరమైన చర్యలు

### జిల్లా విద్యాశాఖాధికారి డా. అబ్దుల్ హై



హనుమకొండ జూన్ 10 (ప్రజామంటలు): జిల్లావ్యాప్తంగా కొన్ని ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు విద్యార్థుల నుండి నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజును వసూలు చేస్తున్నట్లు, ఆకర్షనీయమైన పేర్లతో తల్లి దండ్రులను ప్రలోభాలకు గురి చేస్తునట్లు, అవసరం లేని స్టేషనరీ కొనే విధంగా తల్లిదండ్రులను బలవంతం చేస్తూ వసూలు చేస్తునట్లుగా ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. అదేవిధంగా పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ ఎక్కువ ధరలకు అమ్ముతున్నట్లుగా సమాచారం ఉందన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా అనుమతి లేకుండా నడుపుతున్న పాఠశాలలపై, అధిక ఫీజులు వసూలుజేసినా, నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ అమ్మినా ఆయా పాఠశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతి లేకుండా పాఠశాలలను, నడిపినా సదరు యాజమాన్యాలపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోనున్నట్లు హనుమకొండ జిల్లా విద్యాశాఖాధికారి డా. అబ్దుల్ హై తెలిపారు.

## బడిఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

### బడిబాట కార్యక్రమ గోడప్రతుల ఆవిష్కరణ - జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ జూన్ 10 (ప్రజామంటలు):



జిల్లా కలెక్టరేట్ లో కలెక్టర్ ప్రావీణ్య జయశంకర్ బడిబాట కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో విద్యశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన బడిబాట కార్యక్రమ గోడప్రతులను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.... జిల్లావ్యాప్తంగా బాల కార్మికులు, బడి ఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలనే సంకల్పంతో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని జిల్లాలో ఈ నెల 6 నుంచి 19 వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య తెలిపారు. చదువుకు దూరమైన ప్రతి ఒక్కరిని తిరిగి పాఠశాలల్లో చేర్పించడమే ప్రభుత్వం ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ వాసంతి, డిఆర్డీఓ కౌసల్యాదేవి, జెడ్పి సీఈ, ఇంచార్జి డిపిఓ రామిరెడ్డి,ఆర్డీఓ లు సీతం దత్తు, కృష్ణవేణి సంబంధిత శాఖల జిల్లా అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద ప్రజలకు సంక్షేమ పథకాల మంజూరికి కృషి

### సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

### కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

సికింద్రాబాద్ జూన్ 10 (ప్రజామంటలు): నిరుపేద ప్రజలకు అన్ని సంక్షేమ పథకాలు లభించేలా కృషి చేస్తున్నామని, సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలో అన్ని ప్రభుత్వ పథకాలను సీతాఫల్ మండీ లోని ఎం.ఎల్.ఏ. కార్యాలయం ద్వారానే నిర్వహిస్తామని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలో మారేడుపల్లి తహసీల్దార్ కార్యాలయానికి సంబంధించిన వివిధ మున్సిపల్ డివిజన్లకు చెందిన 82 మందికి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పద్మారావు గౌడ్ సోమవారం సీతాఫల్ మండీ క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ.... గత పదేళ్లుగా ప్రతీ ఇంటికీ వివిధ సంక్షేమ పథకాలను అందించాగలిగామని, అన్ని వర్గాలకు చెందిన వారికీ ప్రయోజనం చేకూర్చగలిగామని తెలిపారు. ఓట్లు, ఎన్నికలు, రాజకీయాలతో నిమిత్తం లేకుండా అన్ని వేళల్లో ప్రజలతో సంబంధాలు కలిగి ఉన్నామని పద్మారావు గౌడ్ అన్నారు. ప్రజలు తమ పనులకు సీతాఫలమండీ లోని తమ కార్యాలయాన్ని అన్ని పని వేళల్లో సంప్రదించవచ్చునని, ప్రభుత్వ పథకాల కోసం ఎవరికీ చిల్లి గవ్వ కూడా లంచం చెల్లించవద్దని చెప్పారు. కార్పొరేటర్లు సామల హేమ, రాసురి సునీత రమేష్, లింగాని ప్రసన్న లక్ష్మి శ్రీనివాస్, కంది శైలజ, యువ నేతలు రామేశ్వర్ గౌడ్, పోతురాజు మహేశ్, సురేశ్, నరేశ్, నర్సింగ్, శ్రీకాంత్, తహసీల్దార్ పద్మా సుందరి, శివ కుమార్ పాల్గొన్నారు.




## ఐఎల్ పిఎ జిల్లా జాయింట్ సెక్రటరీగా జాజాల రమేష్



ధర్మపురి జూన్ 10 (ప్రజామంటలు): ఇండియన్ లీగల్ ప్రొపెషనల్ అసోసియేషన్ (ఐ.ఎల్.పి.ఏ) జగిత్యాల జిల్లా జాయింట్ సెక్రటరీ గా జగిత్యాల జిల్లా ధర్మపురి కోర్టు బార్ అసోసియేషన్ కు చెందిన న్యాయవాది జాజాల రమేష్ ను రాష్ట్ర ఉపాధ్యక్షులు దయ్య రాజారాం, స్టేట్ మెంబర్ మేడిచెలిమెల సుమలత లు నియమించారు. కోరుట్లలో జరిగిన సమావేశం లో నూతనంగా జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సంధర్భంగా జాజాల రమేష్ మాట్లాడుతు న్యాయవాదుల అభివృద్ధి కోసం కృషి చేస్తామని అసోసియేషన్ ద్వారా జూనియర్ న్యాయవాదులకు సేవలు అందేవిధంగా చూస్తామని తెలిపారు. పలువురు న్యాయవాదులు, అభిమానులు, శ్రేయోభిలాషులు, ప్రముఖులు జాజాల రమేష్ కు అభినందనలు తెలిపారు.



కేంద్రమంత్రిగా ఎన్నికైన కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ ను డిల్లీలో మల్కాజ్ గిరి ఎంపీ ఈటెల రాజేందర్ తో కలసి శుభాకాంక్షలు తెలియజేసిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హుస్నాబాద్ నియోజకవర్గ నాయకులు జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి

### ఎస్.ఎస్.సి. లో ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ ఉన్నత విద్యార్థులను సత్కరించిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్



జగిత్యాల జూన్ 10 (ప్రజామంటలు): ట్టణంలోని 14వ వార్డు కొత్తవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన సంబు రాజేందర్ 9.5, యం.డి రేహాన్ 9.3, అడిభా మహీన్ 9.3, గాజంగి సోనాక్షి 9.0, తిప్పర్తి సరస్వతి 8.8 జిపిఏ సాధించిన విద్యార్థులను అభినందించి శాలువాతో సత్కరించిన జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్.
వెంట యూత్ నాయకులు కూతురు శేఖర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి


### కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష




జగిత్యాల జూన్ 10 (ప్రజామంటలు): ఠశాలలు పునః ప్రారంభం కానున్న దృష్ట్యా తరగతి గదులు శుభ్ర పరచడం, మౌలిక సదుపాయాలు కల్పించడం జరగాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. సోమవార ము సమావేశ మందిరంలో ప్రజావాణి అనంతరం పాఠశాలల పునః ప్రారంభం అవుతున్న నేపథ్యంలో విద్యార్థులకు కనీస సదుపాయాలు కల్పించడం, పాఠ్య, నోటు పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందించడం జరగాలని అన్నారు. అదేవిధంగా వసతి గృహాల్లో కూడా అన్ని శుభ్రం చేయించాలని, గత సంవత్సరం పాఠశాలలు ముగింపు సమయంలో మిగిలి పోయిన బియ్యం, తదితర సామాగ్రి ఈ సంవత్సరం వాడకుండా కొత్తగా ఇండెంటు సమర్పించి సరుకులు తీసుకోవాలనీ ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనారిటీ, తదితర విద్యా సంస్థల జిల్లా అధికారులకు సూచించారు. పాఠశాలలు, విద్యాసంస్థలు, వసతి గృహాల లో ఎలాంటి ఫిర్యాదులు రాకుండా ముందస్తు సరుకు తీసుకునే ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఈ విద్యా సంవత్సరం లో విద్యార్థులకు ఏకరూప దుస్తులను ఆయా మండలాల వారీగా, పాఠశాలల వారీగా పాఠశాలలు ప్రారంభ నాటికి పంపించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులను ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు వారి మండలాల్లో పర్యటించి పాఠశాలల పునః ప్రారంభం సమయంలో పాఠశాలలను తనిఖీ చేయాలని, అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమాలను పరిశీలించాలని సూచించారు. అదేవిధంగా మిషన్ భగీరథ సర్వే పనులను ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. జిల్లాలో దశల వారీగా ప్లాస్టిక్ నిషేధం చేయాలని, కార్యాలయాలు, వ్యాపార సముదాయాలు లో సింగిల్ ప్లాస్టిక్ నిర్మూలించాలని, గ్రామాలు, పట్టణాల్లోనీ స్వయం సహాయక బృందాలకు, ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. అందులో భాగంగా ప్లాస్టిక్ బాటిల్స్ కు బదులు స్టీల్ వాటర్ బాటిల్స్ వాడాలని, ప్రతీ శాఖ కార్యాలయంలో ఇకముందు ప్లాస్టిక్ వాడకుండా పర్యవేక్షించాలని తెలిపారు. వానాకాలం సీజన్ సమయంలో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అవసరం మేరకు అందుబాటు లో ఉన్నాయని, మండల ప్రత్యేక అధికారులు వారి పర్యటనలో ఎరువుల దుకాణాలను పరిశీలించాలని అన్నారు. కృత్రిమ కొరత సృష్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు దివాకర, పి.రాంబాబు, ఆర్డీఓ లు పి. మధుసూదన్, శ్రీనివాస్, జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## కవ్వంపెల్లి కి జన్మదిన శుభాకాంక్షల వెల్లువ

### ఇల్లందకుంట కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఇంగిలె రామారావు



జమ్మికుంట జూన్ 10 (ప్రజామంటలు): జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మాన కొండూర్ మ్మెల్యే కవ్వంపెల్లి సత్య నారాయణ జన్మదినం సందర్బంగా ఇల్లంతకుంట శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానం లో అర్చన పూజ కార్యక్రమాలు చేసి ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సంతోషం గా ఉండాలని వేదంపండితులు దీవించడం జరిగింది. ఇల్లంతకుంట మండల అధ్యక్షులు ఇంగిలే రామారావు గారు కరీం నగర్ ఎల్.ఎం.డి. లోని ప్రజాభవన్ వెళ్లి సత్యనారాయణ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసీ శాలువా తో సన్మానం చేసి లడ్డు ప్రసాదం ఇవ్వడం జరిగింది.జమ్మికుంట పట్టణ అధ్యక్షులు సుంకరి రమేష్ బుక్స్ పెన్నులు అందజేయడం జరింగింది. ఈ కార్యక్రమం లో జిల్లా ఫిషర్ మెన్ చైర్మన్ బండి మల్లేష్ ఎన్.ఎస్.యు.ఐ. నాయకులు పర్లపెల్లి నాగరాజు, పాతకాల అనిల్, గోలి కిరణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలి

### అదనపు కలెక్టర్ రాంబాబు

జగిత్యాల జూన్ 10 (ప్రజామంటలు): బక్రీద్ పండుగను భక్తి శ్రద్ధలతో సమన్వయంతో నిర్వహించుకోవాలని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) పి.రాంబాబు అన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా సమన్వయ సమావేశం సోమవారం సమావేశ మందిరము లోని కాన్ఫరెన్స్ హాల్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ%ౌ%. జిల్లాలో బక్రీద్ పండుగను భక్తి భావనతో ఏలాంటి సంఘటనలకు తావివ్వకుండా సామరస్యపూర్వకంగా నిర్వహించుకోవాలని అన్నారు. పండుగ వేళ ఎలాంటి వదంతులు నమ్మకూడదని అన్నారు. పండుగ సందర్భంగా జంతువధ స్లాటర్ హౌస్ లోనే చేయాలని, పశు సంవర్ధక శాఖ అధికారులు జారీ చేసిన పశువులను మాత్రమే వదించాలనీ అన్నారు. వర్షాకాలం కనుక శానిటేషన్ పనులు ఎప్పటికప్పుడు నిర్వహించాలని, వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉంటుందని తెలిపారు. ధర్మపురిలో స్లాటర్ హౌస్ తాత్కాలికంగా ఏర్పాటుకు మునిసిపల్ కమీషనర్ తో చర్చించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిబంధనలకు అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. మునిసిపల్, గ్రామ పంచాయతీ అధికారులు,సిబ్బంది ఎప్పటికప్పుడు శానిటేషన్ పై చర్యలు తీసుకోవాలని అన్నారు.
డీఎస్పీ రఘుచందర్ మాట్లాడుతూ, సోషల్ మీడియా లో వచ్చే వదంతులు నమ్మవద్దని, పోలీసు అధికారులను సంప్రదించాలని అన్నారు. పలువురు మతపెద్దలు మాట్లాడుతూ, ఆవులను వదించబోమనీ తెలిపారు. పశువుల డాక్టర్ సర్టిఫికెట్ ఇచ్చిన వాటినే వదిస్తామని తెలిపారు. అంతకుముందు సహాయ సంచాలకులు నరేష్ పవర్ పాయింట్ ద్వారా పశు వధ, చట్టం,తదితర అంశాలపై వివరించారు. జిల్లాలో ఐదు చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని తెలిపారు. వెల్గటూరు మండలం రాజరాంపల్లి, ధర్మపురి మండలం రాయపత్నం, మెట్పల్లీ మండలం రాజేశ్వర్ రావు పెట్, కొడిమ్యల్ మండలం జేఎన్టీయూ క్రాస్ రోడ్, రాయికల్ మండలం బోర్నపల్లి లలో ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సమావేశంలో డీఎస్పీ రవీందర్, జిల్లా పశు సంవర్ధక అధికారి వేణుగోపాల్, జిల్లా ట్రాన్స్ పోర్ట్ అధికారి వంశీదర్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఆర్.ఎస్.చిత్రు, డి ఎం ఓ ప్రకాష్, వివిధ శాఖల అధికారులు, మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గొల్లపల్లి జూన్ 10 (ప్రజామంటలు): గొల్లపల్లి మండల కేంద్రంలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో 2009 11 లో సిఇసి విభాగంలో విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల రోజుల్లో నీ అనుభవాలను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యనందించిన అధ్యాపకులను సన్మానించారు. పాలు రంగాల్లో స్థిరపడిన తోటి విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమేష్ బాబు, అధ్యాపకులు నారాయణ, శ్రీధర్, గణపతి, వెంకట్, కొమరయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎర్రబెల్లి నుండి హనుమకొండకు నూతన ఆర్టీసీ బస్సు

### ప్రయాణికులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్

వేలేరు జూన్ 10 (ప్రజామంటలు): వేలేరు మండల ఎర్రబెల్లి గ్రామంలో ఆర్టీసీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహాలక్ష్మి పథకంలో భాగంగా వేలేరు మండలం ఎర్రబెల్లి గ్రామం నుండి హనుమకొండ వరకు నూతన ఆర్టీసీ బస్సు సేవలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలు ఉచిత బస్సు సౌకర్యం ను వినియోగించుకోవాలని కోరారు. చదువుకునే యువతి, యువకుల కోరిక మేరకు కొత్తపల్లి మార్గం గుండా హనుమకొండ కు ప్రయాణ మార్గం గుండా ఆర్టీసీ రవాణాను ప్రారంభించడం జరిగిందన్నారు. ఎర్రబెల్లి నుండి హనుమకొండకు సుమారు 40 కిలోమీటర్ల దూరం ఉన్నప్పటికీ ఎర్రబెల్లి గ్రామ ప్రజల సౌకర్యార్థం, గ్రామ యువతి యువకుల కోరిక మేరకు ఆర్టీసీ సేవలను ప్రారంభించామని, ఆర్టీసీ ద్వారా తెలంగాణ ప్రజలకు మరింత సేవలను అందించేందుకు కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ వరంగల్ ఆర్ఎం వసంత, డిప్యూటీ ఆర్ఎం భానుకిరణ్, రెడ్ క్రాస్ సొసైటీ వైస్ ఛైర్మన్ పెద్ది వెంకట నారాయణ, తహశీల్దార్ కొమి, తదితరులు పాల్గొన్నారు.






## స్టాక్ మార్కెట్ల లాభాలకు బ్రేక్

### స్వల్ప నష్టాలతో ముగిసిన మార్కెట్లు

**ముంబై, జూన్ 10 (ప్రజా మంటలు):** దేశీయ స్టాక్ మార్కెట్లలో వరుసగా మూడు సెషన్లలో లాభాలకు బ్రేక్ పడింది. ఐటీ స్టాక్స్‌తోపాటు హెచ్డీఎఫ్సీ బ్యాంక్, మారుతి సుజుకి, బజాజ్ ్గనాన్స్, ఐటీసీ వంటి బ్లూ చిప్ కంపెనీల స్టాక్స్ పతనం కావడంతో సోమవారం దేశీయ స్టాక్ మార్కెట్లు స్వల్ప నష్టాలతో ముగిశాయి. బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ 203 పాయింట్ల (0.27 శాతం) నష్టంతో 76,490 పాయింట్ల వద్ద, ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 31 పాయింట్ల (0.13 శాతం) పతనంతో 23,259 పాయింట్ల వద్ద స్థిర పడ్డాయి. బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ ఇంట్రాడే ట్రేడింగ్‌లో 77,079 పాయింట్ల జీవిత కాల గరిష్టాన్ని తాకింది. సెన్సెక్స్ 77 వేల మార్కును దాటడం ఇదే మొదటిసారి. ఎన్ఎస్ఈ నిఫ్టీ సైతం అంతర్గత ట్రేడింగ్ లో 23,400 పాయింట్ల మార్కును దాటి 23,412 పాయింట్ల ఆల్ టైం గరిష్ట స్థాయికి చేరుకున్నది. టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, విప్రో, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ్గ÷నాన్స్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్, మారుతి సుజుకి, హెచ్డీఎఫ్సీ బ్యాంకు, టైటాన్, ఐటీసీ స్టాక్స్ 0.5 నుంచి 2.6 శాతం వరకూ నష్టాలతో ముగిశాయి. మరోవైపు బీఎస్ఈ మిడ్ క్యాప్ 0.56 శాతం, బీఎస్ఈ స్మాల్ క్యాప్ ఒక శాతం లాభాలతో ముగిశాయి. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 1.8 శాతం, నిఫ్టీ మెటల్ 0.38 శాతం నష్టపోగా, నిఫ్టీ మీడియా ఇండెక్స్ దాదాపు రెండు శాతం లాభ పడింది.



## సోనియా కుటుంబంతో హసీనా భేటీ

### ఆత్మీయంగా పకలరించుకున్న నేతలు

**న్యూఢిల్లీ,జూన్10 (ప్రజా మంటలు):** కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రాను.. బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా సోమవారం ఢిల్లీలో కలిశారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన హసీనా సోమవారం స్వదేశానికి తిరిగి వెళ్లనుండగా.. హస్తినలో సోనియా కుటుంబ సభ్యులతో భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. హసీనా, సోనియా భేటీలో ఇరు కుటుంబాల మధ్య ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. శనివారం ఢిల్లీకి చేరుకున్న షేక్ హసీనా ఆదివారం జరిగిన ప్రధాని మోదీ, ఆయన మంత్రివర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు. అయితే హసీనా, గాంధీ కుటుంబానికి మధ్య ఏళ్లుగా అనుబంధం ఉంది. షేక్ హసీనా తండ్రి, బంగ్లాదేశ్ వ్యవస్థాపక నేత షేక్ ముజిబుర్ రెహమాన్, అప్పటి భారత ప్రధాని ఇందిరా గాంధీతో సత్సంబంధాలు కలిగి ఉండేవారు. 1971లో బంగ్లాదేశ్ విముక్తి యుద్ధంలో ఇందిరా గాంధీ కీలక పాత్ర పోషించారు. పాకిస్థాన్ నుంచి బంగ్లాదేశ్‌ను విముక్తి చేశారు. ఆ దేశ స్వాతంత్ర్యానికి మద్దతు ఇవ్వడంతో అప్పటి నుంచి ఇందిరా కుటుంబంతో వారికి సత్సంబంధాలు ఏర్పడ్డాయి.



## పేటీఎంలో ఉద్యోగ కోతలు.. సంఖ్యపై రాని స్పష్టత!

దిల్లీ: పేటీఎం బ్రాండ్‌పై ఆర్థిక సేవలను అందిస్తున్న వన్ 97 కమ్యూనికేషన్స్ పెద్ద సంఖ్యలో ఉద్యోగుల్ని తొలగించింది.ఎంతమందిని తొలగించిందీ మాత్రం కంపెనీ అధికారికంగా వెల్లడించలేదు. వారు వేరే సంస్థల్లో ఉద్యోగం సాధించడంలో తాము సాయపడుతున్నట్లు కంపెనీ ఓ ప్రకటనలో తెలిపింది. 'కంపెనీ పునర్వ్యవస్థీకరణ చర్యల్లో భాగంగా ఉద్యోగ కోతలు చేపట్టాల్సి వచ్చింది. ఉద్యోగ విరమణ చేసిన వారికి వేరే సంస్థలో ఉద్యోగ కల్పించడంలో తోడ్పడుతున్నాం. మా హెచ్‌ఆర్ టీమ్ 30 సంస్థలతో కలిసి పనిచేస్తోంది" అని పేటీఎం పేర్కొంది.2024 మార్చి నాటికి పేటీఎంలో 36,521 మంది పనిచేస్తున్నారు. అంతకుముందు త్రైమాసికంతో పోలిస్తే ఈ సంఖ్య 3,500 వరకు తగ్గింది. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌పై.. రిజర్వ్ బ్యాంక్ చర్యల నేపథ్యంలో పేటీఎం ఉద్యోగ కోతలు చేపట్టింది. ఇప్పుడు మరోసారి ఉద్యోగులకు ఉద్వాసన పలకాలని నిర్ణయించింది. పెండింగ్‌లో ఉన్న బోనస్‌లను సైతం పేటీఎం విడుదల చేసింది. పారదర్శకంగా లేఆఫ్‌ల ప్రక్రియ చేపడుతున్నట్లు కంపెనీ పేర్కొంది. పేటీఎం పేమెట్స్ బ్యాంక్‌పై ఆర్‌బీఐ ఆంక్షల నేపథ్యంలో కంపెనీ నష్టాలు పెరిగాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో



రూ.167.5 కోట్ల నష్టాలను ప్రకటించిన ఆ సంస్థ.. గడిచిన ఆర్థిక సంవత్సరంలో చివరి త్రైమాసికంలో నష్టం రూ.550 కోట్లకు పెరిగింది. దీంతో ఫలితాల వెల్లడి సమయంలోనే ఉద్యోగ కోతలుంటాయని సంకేతాలు ఇచ్చింది. ఏఐ వినియోగాన్ని పెంచి తద్వారా పరిమిత సంఖ్యలో ఉద్యోగులతో కొనసాగాలని నిర్ణయానికొచ్చింది. కంపెనీని లాభదాయకతలోకి తీసుకురావడంపై పనిచేస్తున్నట్టు పేర్కొంది.

## ముంబై విమానాశ్రయంలో 72 బంగారు బిస్కెట్లు పట్టివేత



ముంబయి: ముంబయి విమానాశ్రయంలో భారీగా బంగారం పట్టుబడింది. ఇద్దరు విదేశీ మహిళల వద్ద 32.79కిలోల బరువున్న 72 బంగారు బిస్కెట్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వాటిని లోదుస్తులు, బ్యాగుల్లో దాచి తరలించేందుకు ప్రయత్నించి దొరికి పోయారు. అనుమానాస్పదంగా కనిపించడం తో వారిని తనిఖీ చేయగా.. భారీగా బంగారం బయటపడింది. దీంతో వారిద్దరినీ పోలీసులు అరెస్ట్ చేశారు.



## శాశ్వత నివాస హోదా వచ్చిన కొద్దిరోజులకే.. కెనడాలో భారతీయుడి హత్య

సర్రే: కెనడాలో నివసిస్తున్న ఇండియన్ యువరాజ్ గోయల్ (28) హత్యకు గురయ్యారు. కొందరు దుండగులు ఆయనపై కాల్పులు జరపడంతో ప్రాణాలు కోల్పోయారు.జూన్ 7న ఈ ఘటన జరిగినట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి.యువరాజ్‌ది పంజాబ్‌లోని లుథియానా. ఉన్నతచదువులు నిమిత్తం 2019లో ఆయన కెనడా వెళ్లారు. ప్రస్తుతం సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా ఉద్యోగం చేస్తున్నారు. ఇటీవల కెనడాలో శాశ్వత నివాస హోదా లభించింది. ఈ క్రమంలోనే శుక్రవారం బ్రిటిష్ కొలంబియాలోని సర్రే ప్రాంతంలో కాల్పులు జరిగినట్లు పోలీసులకు సమాచారం అందింది. వారు అక్కడికి చేరుకొని యువరాజ్ మృతదేహాన్ని గుర్తించారు. ఈ ఘటనలో నలుగురు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకొని, విచారిస్తున్నారు. మృతుడికి ఎలాంటి నేర చరిత్ర లేదని వెల్లడించారు. అయితే ఈ ఘటనకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

NATIONAL
International

## ఎన్నికల్లో ఓడినా.. పార్లమెంట్ సభ్యుడు కాకపోయినా..

## కేంద్రమంత్రిగా



దిల్లీ: ఎన్నికల ముందు కాంగ్రెస్ నుంచి భాజపాలో చేరిన రవనీత్ సింగ్ బిట్టు.. పంజాబ్‌లో లుధియానా నుంచి పోటీ చేసి ఓటమి చవిచూశారు.రాజ్యసభలోనూ ఆయన సభ్యుడు కాదు. అయితే ఆదివారం జరిగిన ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఆయన కేంద్రమంత్రిగా బాధ్యతలు స్వీకరించడం విశేషం.వ్యవసాయ చట్టాలకు నిరసనగా 2020లో శిరోమణి అకాలీదళ్ ఎన్డీయే నుంచి బయటకు వెళ్లిపోవడంతో ఈ ఎన్నికల్లో భాజపా ఒంటరిగా బరిలోకి దిగింది. కమలం పార్టీ నుంచి బరిలోకి దిగిన రవనీత్‌ను పంజాబ్ కాంగ్రెస్ చీఫ్ అమరీందర్ సింగ్ రాజా ఓడించారు. ఈ ఓటమి తర్వాత కూడా ఆయనపై అగ్రనాయకత్వం విశ్వాసంతో ఉంచింది. పంజాబ్‌లో ప్రభావశీల నేత అని భావిస్తోంది. అంతేగాకుండా ఆయన ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి బియాంత్ సింగ్ మనవడు. పంజాబ్ వేర్పాటువాదాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన బియాంత్.. సీఎంగా ఉన్న సమయంలోనే హత్యకు గురయ్యారు. ఆ కుటుంబ వారసుడు కావడం కూడా రవనీత్‌ను మంత్రివర్గంలోకి తీసుకోవడానికి కారణమైందని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. మరోపక్క ఖలిస్థానీ సానుభూతిపరులు అమృత్ పాల్ సింగ్, సరబ్‌జిత్ సింగ్ ఖల్సా ఈ ఎన్నికల్లో విజయం సాధించారు. అమృత్‌పాల్ సింగ్ ప్రస్తుతం జైల్లోఉండగా..ఖల్సానేమో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హంతకుడి కుమారుడు కావడం గమనార్హం. ఈ పరిణామాల మధ్య బిట్టుకు ప్రాధాన్యం దక్కింది.ఆయన మోదీ సమావేశానికి వచ్చిన తరుణంలో ఒక ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. ప్రధాని నివాసానికి వస్తుండగా.. ఆయన కారు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయింది. దాంతో ఆలస్యంగా వెళ్లకూడదని భావించి.. వాహనం దిగి, పరిగెత్తుకుంటూ సమావేశ వేదిక వద్దకు చేరుకోవడం గమనార్హం. దానికి సంబంధించిన వీడియో నెట్టింట్లో వైరల్‌గా మారింది. మరోపక్క, కేరళ నుంచి జార్జ్ కురియన్ కూడా పార్లమెంట్ సభ్యుడు కాకపోయినా సహాయ మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సంగతి తెలిసిందే. ఈసారి మంత్రి వర్గంలో ఆ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తోన్న రెండో నేత ఆయన. క్రైస్తవ వర్గానికి చేరువ అయ్యేందుకు భాజపా వేసిన ఓ అడుగుగా దీనిని పరిగణిస్తున్నారు.

## ఐటీఆర్ ఫైలింగ్.. ఈ తప్పులు చేయొద్దు..!

పన్ను చెల్లింపుదారులు రిటర్నులు దాఖలు చేసే సమయం ఆసన్నమైంది. సరైన అవగాహన లేకపోయినా లేదా నిపుణుల సహాయం లేకుండా ఐటీఆర్ సమర్పించడం కొంత కష్టమైన విషయమే.

చాలామంది జాగ్రత్తగానే ఈ ప్రక్రియను పూర్తి చేస్తారు. కానీ, గడువు సమీపిస్తున్న తరుణంలో తొందర్లో ఒక్కోసారి పొరపాట్లు చేసేస్తుంటారు. ఐటీఆర్‌లో చేసే తప్పులను సరిదిద్దుకునే వెసులుబాటు ఉంటుంది. రివైజ్డ్ రిటర్నుల దాఖలు చేయడం ద్వారా వాటిని సవరించుకోవచ్చు. కానీ, అందుకోసం ప్రత్యేకంగా సమయం కేటాయించాలి. ఇది కొంత చికాకు పెట్టే అంశం. అందుకే తొలిసారే జాగ్రత్త వహిస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ఈనేపథ్యంలో రిటర్నులు దాఖలు చేసేటప్పుడు తప్పులు లేకుండా చూసుకునేందుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో చూద్దాం..




**సరైన ఫారం..**

కేంద్ర ప్రత్యక్ష పన్నుల విభాగం ఇప్పటికే ఏడు రకాల ఐటీ ఫారాలను నోటిఫై చేసింది. వీటిలో మీకు ఏది సరైందో చూసి ఎంచుకోవాలి. రూ.50లక్షల వరకూ వేతనం, ఒక ఇంటిపై ఆదాయం, వడ్డీ తదితర మార్గాల్లో ఆదాయం వస్తున్నప్పుడు ఐటీఆర్-1 దాఖలు చేయొచ్చు. వ్యక్తులు, హిందూ అవిభాజ్య కుటుంబాలు, సంస్థలకు రూ.50 లక్షలకు పైగా ఆదాయం ఉన్నప్పుడు ఐటీఆర్-4ను ఎంచుకోవచ్చు. ఐటీఆర్-2ను రూ.50లక్షలకు పైగా ఆదాయం ఉండి, ఒకే ఇంటి ద్వారా ఆదాయం ఉన్నప్పుడు దాఖలు చేయాలి. వృత్తి నిపుణులు, ఐటీఆర్-1, ఐటీఆర్-2ల విషయంలో అనుమానం ఉన్నవారు ఐటీఆర్-3ని ఎంచుకోవచ్చు. షేర్లలో క్రయవిక్రయాలు చేసినప్పుడు మీరు నిర్వహించిన లావాదేవీల ఆధారంగా ఐటీఆర్-2 లేదా ఐటీఆర్ 3ని ఎంచుకోవాల్సి ఉంటుంది. మిగతా పత్రాలు కంపెనీలు, వ్యాపార సంస్థలకు వర్తిస్తాయి.

**బ్యాంకు ఖాతా ధ్రువీకరణ..**

పన్ను చెల్లింపుదారులంతా ఈ-ఫైలింగ్ పోర్టల్‌లో ముందుగానే తమ బ్యాంకు ఖాతాలను ధ్రువీకరించాల్సి ఉంటుంది. ట్యాక్స్ పేయర్ల ఖాతా యాక్టివ్‌గానే ఉందని ఇది నిర్ధరిస్తుంది. అప్పుడే రిఫండ్లు జమ చేసేందుకు వెసులుబాటు ఉంటుంది. ఇంటి రుణం తొందరగా తీర్చేద్దాం

**ఐటీఆర్ ఈ-వెరిఫై..**

ఐటీఆర్ దాఖలు చేసిన తర్వాత దాన్ని పన్ను చెల్లింపుదారులు కచ్చితంగా ధ్రువీకరించాలి. అప్పుడే దాఖలు ప్రక్రియ పూర్తయినట్లు. లేదంటే రిటర్నులను పరిగణనలోకి తీసుకోరు. ఐటీఆర్ అప్‌లోడ్ చేసిన 30 రోజుల్లోగా దాన్ని వెరిఫై చేయాల్సి ఉంటుంది.

**మినహాయింపులు..**

ఆదాయపు పన్ను మినహాయింపుల్లో సెక్షన్ 80సీ ప్రధానం. నిబంధనల ప్రకారం ఈ సెక్షన్ కింద వివిధ పెట్టుబడి పథకాల్లో మదుపు చేసి, రూ.1,50,000 వరకూ మినహాయింపు పొందవచ్చు. ఈపీఎఫ్, పీపీఎఫ్, ఈఎల్ఎస్ఎస్, గృహరుణం అసలు, పిల్లల ట్యూషన్ ఫీజులు, జీవిత బీమా పాలసీలకు చెల్లించే ప్రీమియం తదితరాలన్నీ ఈ సెక్షన్ పరిధిలోకే వస్తాయి. సెక్షన్ 80డీలో ఆరోగ్య బీమా ప్రీమియం వివరాలు నమోదు చేయాలి. సేవింగ్స్ ఖాతా ద్వారా వచ్చిన వడ్డీ ఆదాయంపై రూ.10,000 వరకు 80టీటీఏ కింద మినహాయింపు కోరవచ్చు. అలాగే వేతనంలో హెచ్‌ఆర్ఏ లేనట్లయితే అద్దె చెల్లింపులకు 80జీజీ కింద మినహాయింపు ఉంటుంది. పన్ను ఆదా కోసం అన్ని రకాల పెట్టుబడులు, ఖర్చులను రిటర్నులలో సరిగ్గా పేర్కొనాలి.

**ఇతర ఆదాయాలు..**

చాలామంది పన్ను చెల్లింపుదారులు అదనపు మార్గాల ద్వారా వచ్చే ఆదాయాన్ని ఐటీఆర్‌లో చూపించరు. వడ్డీ, కమిషన్ వంటి వాటినుంచి వచ్చే ఇన్‌కమ్‌ను వదిలేస్తుంటారు. వీటన్నింటిపై టీడీఎస్ కట్ చేసి ఉంటారనే ఉద్దేశంతో అవసరం లేదనుకుంటారు. కానీ, ఐటీఆర్‌లో ప్రతీ ఆదాయ మార్గాన్ని పేర్కొనాల్సిందే. లేదంటే తర్వాత ఇబ్బందులు ఎదుర్కోవాల్సి రావొచ్చు.

**ఆలస్యం..**

ఐటీఆర్ ఫైలింగ్‌ను గడువులోగా పూర్తి చేయాలి. లేదంటే రూ.1,000 నుంచి రూ.5,000 వరకు జరిమానా చెల్లించాల్సి వస్తుంది. ఆడిట్ అవసరం లేని వ్యక్తులు జులై 31 వరకూ రిటర్నులు దాఖలు చేయాల్సి ఉంటుంది.

**టీడీఎస్ జమ..**

కొన్నిసార్లు ఆదాయపు పన్ను దగ్గర ఉన్న వివరాలకూ, మీ ఫారం-16కూ సరిపోకపోవచ్చు. మీ వద్ద వసూలు చేసిన పన్నును ఆదాయపు పన్ను విభాగానికి జమ చేయకపోవడం వల్ల ఈ వ్యత్యాసం కనిపిస్తుంది. రిటర్నులు దాఖలు చేసేముందు మీ ఫారం-16, ఫారం 16ఏ, 26ఏఎస్, వార్షిక సమాచార నివేదిక (ఏఐఎస్)లను పూర్తిగా పరిశీలించండి. ఏదైనా తేడా ఉంటే మీ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి, సరిచేసుకోండి. పొరపాట్లతో రిటర్నులు సమర్పిస్తే నోటీసులు వచ్చే ప్రమాదం ఉంది.

**ఆదాయాలన్నీ..**

ఐటీఆర్ దాఖలు చేసేటప్పుడు అన్ని ఆదాయాలనూ తప్పనిసరిగా నివేదించాలి. కొంతమంది కొన్ని ఆదాయాలను పేర్కొనరు. ఇది చట్టాన్ని ఉల్లంఘించినట్లే. ఆదాయపు పన్ను శాఖ దీన్ని గుర్తిస్తే నోటీసులు పంపే అవకాశం ఉంటుంది. చాలామంది వ్యక్తులు తమ వేతనాన్ని మాత్రమే నమోదు చేస్తారు. బ్యాంకు పొదుపు ఖాతా, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బీమా పాలసీల నుంచి వచ్చిన ఆదాయం, పీపీఎఫ్ వడ్డీలను పట్టించుకోరు. మినహాయింపు పరిధిలోకి వచ్చే ఆదాయ వివరాలనూ రిటర్నులలో చూపించాల్సిందేనని నిబంధనలు చెబుతున్నాయి. మైనర్ పిల్లల పేరుతో పెట్టుబడులు ఉండి, వాటి ద్వారా ఆదాయం వస్తుంటే.. ఆ మొత్తాన్నీ అసెసీ ఆదాయంలో భాగంగానే పరిగణిస్తారు.

## కేంద్ర క్యాబినెట్‌కు రాజీనామా వార్తలు..

### క్లారిటీ ఇచ్చిన సురేశ్ గోపి



దిల్లీ: దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ వరుసగా మూడోసారి బాధ్యతలు చేపట్టారు. ఆయనతో పాటు 71 మంది కేంద్ర మంత్రులు ప్రమాణం చేసిన సంగతి తెలిసిందే.

వీరిలో 30 మందికి క్యాబినెట్ హోదా ఉంటుంది. ఈ క్రమంలోనే కేంద్ర క్యాబినెట్‌లో కొనసాగడంపై ఆసక్తి లేదంటూ తనపై వచ్చిన ఆరోపణలపై భాజపా ఎంపీ సురేశ్ గోపి స్పందించారు. అదంతా తప్పుడు సమాచారమని కొట్టిపారేసిన ఆయన.. క్యాబినెట్ నుంచి వైదొలిగే ఉద్దేశం తనకు లేదని క్లారిటీ ఇచ్చారు.ప్రధానితో సహా క్యాబినెట్ మంత్రిగా సురేశ్ గోపి ఆదివారం ప్రమాణం చేశారు. ఈనేపథ్యంలోనే తనకు కేంద్ర మంత్రి పదవిపై ఆసక్తి లేదని.. ఎంపీగా కొనసాగడమే ఇష్టమని ఆయన తెలిపినట్లు వార్తలు పుట్టుకొచ్చాయి. తన అభిప్రాయాన్ని అధిష్ఠానానికి తెలియజేశానని.. తుది నిర్ణయం పార్టీకే వదిలేస్తున్నానని ప్రమాణ కార్యక్రమం అనంతరం ఆయన మాట్లాడినట్లు ఫేక్ సమాచారం ప్రచారమైంది.తనపై వచ్చిన ఊహాగానాలు చర్చనీయాంశంగా మారడంతో సురేశ్ గోపి స్పందించారు. "ప్రధాని మోదీ నేతృత్వంలోని మంత్రిమండలికి నేను రాజీనామా చేస్తానంటూ కొన్ని మీడియా సంస్థలు తప్పుడు సమాచారం ప్రచారం చేశాయి. నాకు అలాంటి ఉద్దేశం లేదు. మోదీ నాయకత్వంలో కేరళ అభివృద్ధి, శ్రేయస్సుకు కట్టుబడి ఉన్నా" అని స్పష్టం చేశారు.ఇదిలాఉండగా.. ఉత్తరాదిలో బలంగా ఉన్న కాషాయ పార్టీ.. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో త్రిశ్శూర్‌లో గెలవడంతో కేరళలో తొలిసారి ఖాతా తెరిచింది. ఆ స్థానం నుంచి భాజపా అభ్యర్థిగా పోటీ చేసిన సినీ నటుడు సురేశ్ గోపి 74 వేల మెజార్టీతో ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే.

## మణిపుర్ సీఎం సెక్యూరిటీ

### కాన్వాయ్‌పై కాల్పులు..!



ఇంఫాల్: జాతుల మధ్య వైరంతో అల్లకల్లోలంగా మారిన మణిపుర్ లో ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ సెక్యూరిటీ కాన్వాయ్‌పై దాడికి ప్రయత్నాలు జరిగాయి.సోమవారం ఉదయం సాయుధులైన కొందరు తీవ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. సీఎం కార్యాలయానికి చెందిన వర్గాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. ఈ ఘటన కాంగ్‌పోక్పి జిల్లాలో చోటుచేసుకొంది.ఇటీవల జిరిబామ్ జిల్లాలో ఓ వ్యక్తిని గుర్తు తెలియని దుండగులు దారుణంగా హత్య చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనతో రాష్ట్రంలో ఉద్రిక్తతలు తీవ్రంగా మారాయి. 70కి పైగా ఇళ్లను తగలబెట్టడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మరికొందరు పౌరులు వేరే చోటుకు పారిపోయినట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయంలో తమ వద్ద నుంచి లైసెన్స్ తుపాకులను జప్తు చేయడంతో వాటిని తిరిగి ఇచ్చేయాలంటూ స్థానికులు జిల్లా పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసనకు దిగారు. ఇలా కొన్ని రోజులుగా అశాంతి నెలకొన్న ఈ ప్రాంతాన్ని సందర్శించాలని సీఎం బీరేన్‌సింగ్ అనుకున్నారు. ఈ క్రమంలోనే ఇంఫాల్ నుంచి జిరిబామ్‌కు సీఎం సెక్యూరిటీ కాన్వాయ్ బయల్దేరింది. దీనిపై సాయుధులైన తీవ్రవాదులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో సెక్యూరిటీ సిబ్బందిలో ఒకరు తీవ్రంగా గాయపడినట్లు సమాచారం.

# ఓవైపు ప్రమాణ స్వీకారానికి ఏర్పాటు

## మరోవైపు మంత్రి పదవులపై జోరుగా చర్చలు - పవన్ కళ్యాణ్‌కు నెంబర్ టూ స్థానం ఖాయం అంటూ ప్రచారం



అమరావతి,జూన్10 (ప్రజా మంటలు): ఓవైపు చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి చురుకుగా ఏర్పాట్లు... మరోవైపు మంత్రులుగా ఎవరెవరు ఎంతమంది అన్న చర్చ సాగుతోంది. అలాగే పవన్ కళ్యాణ్ కేబినేట్‌లో చేరితో ఆయన ప్రాధాన్యం ఎలా ఉండబోతుందన్న చర్చ కూడా సాగుతోంది. ఆయనకు ఉపముఖ్యమంత్రి తో పాటు, హోంశాఖను కేటాయించి నంబర్ టూ స్థానం కల్పిస్తారన్న ప్రచారం సాగుతోంది. ఏపీలో టిడిపి కూటమి 164 అసెంబ్లీ స్థానాల్లో చారిత్రాత్మక విజయం సాధించిన క్రమంలో ఈ నెల 12న టీడీపీ అధినేత చంద్రబాబు సీఎంగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఆయనతో పాటు కొందరు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉంది. అనంతరం మంత్రులకు కేటాయించే శాఖలపైనా ఆయన దృష్టి పెట్టనున్నారు. ప్రమాణస్వీకారానికి ముందే దీనిపై ఓ నిర్ణయానికి రావాలని ఆయన అనుకుంటున్నట్లు తెలుస్తోంది. కాగా, కూటమిలో భాగంగా జనసేన పోటీల చేసిన 21 అసెంబ్లీ స్థానాల్లోనూ ఘన విజయం సాధించింది. ఈ క్రమంలో మంత్రివర్గంలోకి పవన్ వెళ్తారా? లేక ఆ పార్టీ ఎమ్మెల్యేలకు అవకాశం ఇస్తారా. అనేది ఆసక్తికరంగా మారింది.అయితే, జనసేనాని పవన్ కల్యాణ్ మంత్రి వర్గంలోకి వెళ్లేందుకు సంసిద్ధత వ్యక్తం చేస్తున్నారని.. ఆయన ఏపీ ఉప ముఖ్యమంత్రి పదవి తీసుకునేందుకు సముఖంగా ఉన్నారని వార్తలు వస్తున్నాయి. మంత్రివర్గంలో చేరితేనే ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే అవకాశం ఉంటుందని ఆయన భావిస్తున్నారు. పవన్ కల్యాణ్ ప్రభుత్వంలో చేరేందుకు సుముఖంగా ఉన్నారని జనసేన నేతలు కూడా అంగీకరిస్తున్నారు. చంద్రబాబుతో పాటే పవన్ కళ్యాన్ ప్రమాణం ఉంటుందని అంటున్నారు. ఈ క్రమంలో జనగసేన ప్రాధాన్యం ఉంటుందని చంద్రబాబు కూడా పరోక్షంగా చెబుతూనే ఉన్నారు. పవన్ చేసిన పోరాటాన్ని అభినందిస్తున్నారు. మరోవైపు 12న ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు సాగుతున్నాయి. ముఖ్యమంత్రిగా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలోని కేసరపల్లి ఐటీ పార్క్ వద్ద అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 12న ఉదయం 11.27 గంటలకు చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు నేతృత్వంలోని వేదిక ఏర్పాట్లు జరుగుతున్నాయి. గన్నవరం విమానాశ్రయం ప్రధాన గేట్ నుంచి 800 మీటర్ల దూరంలో సభా ప్రాంగణం ఉంటుంది. ప్రధాని నరేంద్ర మోదీ, పలువురు ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులు, ప్రముఖుల రాకకు అవసరమైన ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ ప్రాంతాల నుంచి వేదిక వద్దకు చేరుకోడానికి ప్రత్యేకంగా రహదారులను సిద్ధం చేస్తున్నారు. చంద్రబాబు ప్రమాణ స్వీకార ప్రాంగణాన్ని 14 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్నారు. ప్రధాన వేదికతో పాటు వీఐపీ, వీవీఐపీ, మరో మూడు గ్యాలరీలను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు. వాహనాల పార్కింగ్ కోసం సైతం ఏర్పాట్లు చేస్తున్నారు. వీవీఐపీ వాహనాల పార్కింగ్‌కు కేసరపల్లి గ్రామంలోని పెట్రోల్ బంక్ వెనుక స్థలం కేటాయించారు. సావరగూడెం రోడ్డులోని ఎస్ఎల్‌వీ, వీఎన్‌పురం కాలనీ మార్గంలోని ఎలైట్ విస్టా లే ఔట్, ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాల ఆవరణ, ఆర్టీవో కార్యాలయ ప్రాంగణం, మేధా టవర్స్‌లో మొత్తం ఐదు చోట్ల పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేశారు. ప్రమాణ స్వీకార సమయంలో వర్షం కురిసినా ఎలాంటి ఆటంకం లేకుండా వేదిక, సభా ప్రాంగణంలో ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు 2.5 ఎకరాల్లో ప్రధాన వేదిక, వీఐపీ గ్యాలరీ ఏర్పాటు పనులు శరవేగంగా సాగుతున్నాయి. మిగిలిన 11.5 ఎకరాల్లో నేతలు, ప్రజలకు నాలుగు గ్యాలరీలను ఏర్పాటు చేస్తున్నారు. వర్షం కురిసినా ఇబ్బంది లేకుండా అల్యూమినియంతో కూడిన పటిష్ఠమైన షెడ్లను వేస్తున్నారు. సభా ప్రాంగణం వెలుపల పలు చోట్ల భారీ ఎల్‌ఈడీ తెరలను ఏర్పాటు చేస్తున్నారు. సభ జరిగే సమయంలో నిరంతరాయంగా విద్యుత్తు సరఫరాకు చర్యలు చేపట్టారు. ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఐఏఎస్‌లు హరిజవహర్‌లాల్, బాబు వీరపాండ్యన్, కన్నబాబు, హరికిరణ్‌లను ప్రత్యేక అధికారులుగా నియమించారు. ప్రముఖుల భద్రత, వేదిక, బారికేడింగ్, బ్లాక్‌ల విభజన, పారిశుద్ధ్యం ఏర్పాట్లు, అతిథులకు వసతుల కల్పనలో ఎలాంటి లోటు లేకుండా చూడాలని సీఎస్ నీరభ్‌కుమార్ ప్రసాద్ అధికారులకు సూచించారు. పార్కింగ్ స్థలాలు, ప్రధాన సభకు చేరుకునేందుకు వీలుగా అప్రోచ్ రహదారులను పక్కాగా ఏర్పాటు చేయాలన్నారు. వైద్య శిబిరాలు, తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లను పెద్దసంఖ్యలో అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొనే వారికి నియోజకవర్గాల వారీగా వీవీఐపీ, వీఐపీ పాస్‌లను సిద్ధం చేస్తున్నామని టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తెలిపారు. నరేంద్రమోదీ, పలు రాష్ట్రాలముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు రానున్న నేపథ్యంలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఇందు కోసం విజయవాడ నగరంలోని పెద్ద హోటళ్లలోని గదులన్నింటినీ బుక్ చేసినట్లు చెప్పారు. ఈ నెల 11, 12 తేదీల కోసం ముందుగానే రాష్ట్ర ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ ఆధ్వర్యంలో గదులను బుక్ చేశారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి దాదాపు 10 వేల మంది పోలీసులను బందోబస్తు కోసం వినియోగిస్తున్నారు. ఉండవల్లి కరకట్ట వద్ద ఉన్న చంద్రబాబు నివాసం నుంచి గన్నవరంలోని వేదిక వరకూ 22 కిలోమీటర్ల పరిధిలో పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే మంత్రులు ఎవరెవరన్నది ఇంకా చర్చల దశలోనే ఉంది.

# మంత్రి తలసాని ఇంట్లో విషాదం

## అనారోగ్యంతో సోదరుడు శంకర్ యాదవ్ మృతి



హైదరాబాద్, జూన్ 10 (ప్రజా మంటలు): మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఇంట్లో విషాదం నెలకొంది. తలసాని శ్రీనివాస్ యాదవ్ సోదరుడు తలసాని శంకర్ యాదవ్ సోమవారం ఉదయం మృతి చెందారు. శంకర్ యాదవ్ గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. సికింద్రాబాద్ లోని యశోద హాస్పిటల్ లో చికిత్స పొందుతూ ఆరోజు తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. తలసాని శ్రీనివాస్ యాదవ్ సోదరుడు, తలసాని శంకర్ యాదవ్ మరణం పట్ల బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ సంతాపం ప్రకటించారు. వారి కుటుంబ సభ్యులకు కెసిఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. బోయిన్ పల్లి మార్కెట్ అధ్యక్షుడిగా శంకర్ యాదవ్ కూడా పని చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, బంధువులు, స్నేహితులు ఆయనను పరామర్శిస్తున్నారు. తలసాని శ్రీనివాస్ యాదవ్ బిఆర్ఎస్ పార్టీలో కీలక నేత. సనత్ నగర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. గతంలో బిఆర్ఏ పార్టీలో రెండుసార్లు మంత్రిగా పనిచేశారు. 2014లో కెసిఆర్ తొలి మంత్రివర్గంలో పశు సంవర్ధక, మత్స్యశాఖ, డెయిరీ డెవలప్‌మెంట్, సినిమాటోగ్రఫీ శాఖల బాధ్యతలు నిర్వర్తించారు. రెండో మంత్రివర్గంలో మంత్రిగా కూడా పనిచేశారు. శ్రీనివాస్ యాదవ్ స్వర్ణను వివాహం చేసుకున్నారు. వీరికి కుమారుడు తలసాని సాయి కిరణ్ యాదవ్, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గతంలో బోయిన్ పల్లి మార్కెట్ అధ్యక్షుడిగా తలసాని శంకర్ యాదవ్ పనిచేశారు.

# వైకాపా నేతలను బిజెపిలో చేర్చుకోం

## ఆదినారాయణ రెడ్డి

అమరావతి, జూన్10 (ప్రజా మంటలు): వైకాపా త్వరలోనే భూస్థాపితం అవుతుందని భాజపా నేత, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి అన్నారు. ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు భాజపాలో చేరాలని చూస్తున్నారని వెల్లడించారు. అయితే, వారిని భాజపాలో చేర్చుకోబోమని స్పష్టం చేశారు. ఏపీ రాజధాని శిబిరాల వద్దకు భాజపా నేత, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి విచ్చేశారు. అమరావతి రాజధాని ప్రాంతంలో జంగిల్ క్లియరెన్స్ పనులు వేగంగా కొనసాగుతున్న వేళ ఆయన అక్కడికి చేరుకొని పరిశీలించారు. జగన్ ఓటమికి అమరావతి ఉద్యమం కూడా ఒక ముఖ్య కారణమని తెలిపారు. రాజధానిని తరలించాలని చూసిన జగన్‌కు జనం బుద్ధి చెప్పారన్నారు.

## నూకాంబికా అమ్మవారి ఆలయంలో పవన్ పూజలు



అనకాపల్లి, జూన్10 (ప్రజా మంటలు): జనసేన అధినేత పవన్ కల్యాణ్ అనకాపల్లిలో పర్యటించారు. పట్టణంలో నూకాంబికా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మొక్కులు తీర్చుకున్నారు. తొలుత ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. పిఠాపురంలో తాను గెలిచి కూటమి అధికారంలోకి వస్తే నూకాంబికా అమ్మవారిని దర్శించుకుంటానని అనకాపల్లిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పవన్ చెప్పారు. ఈ నేపథ్యంలో సోమవారం అమ్మవారి ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. పెద్దఎత్తున జనసేన కార్యకర్తలు, అభిమానులు అక్కడికి తరలివచ్చారు.

# రక్తచరిత్ర రాస్తున్న జగన్: లోకేశ్



అమరావతి, మంగళగిరి, జూన్10 (ప్రజా మంటలు): వైఎస్ జగన్ ఓడిపోయినా రక్త చరిత్ర రాస్తూనే ఉన్నాడని మంగళగిరి ఎమ్మెల్యే, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ మండిపడ్డారు. కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం బొమ్మిరెడ్డిపల్లెకి చెందిన టిడిపి నేత గౌరీనాథ్ చౌదరిని దారుణంగా హత్య చేయించారని ఆగ్రహించారు. వైసీపీ ఫ్యాక్షన్ పాలన వద్దని జనం ఛీకొట్టినా, బాబాయ్‌ని చంపినట్టే జనాన్ని చంపుతూ ఉన్నారని ఆరోపించారు. హత్యా రాజకీయాలు ఇకనైనా జగన్ ఆపకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. గౌరీనాథ్ చౌదరి కుటుంబానికి టిడిపి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నిందితులను వదిలే ప్రసక్తే లేదని, వైసిపి ఫ్యాక్షన్ దాడులకు చెక్ పెడతామని అన్నారు. శాంతిభద్రతలు కాపాడుతామని లోకేష్ తెలిపారు.

# టీచర్ల బదిలీల్లో బొత్స అవినీతి

**ఒక్కో టీచర్ వద్ద 3 నుంచి 6 లక్షలు వసూళ్లు**

**విచారణ చేపట్టాలని ఎసిబికి టిడిపి నేత వర్ల ఫిర్యాదు**

అమరావతి, జూన్10 (ప్రజా మంటలు): ఏపీ మాజీ మంత్రి బొత్స సత్యనారాయణపై టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ఏసీబీకి ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలో టీచర్ల బదిలీల్లో బొత్స అక్రమాలకు పాల్పడ్డారని, విచారణ జరపాలని అధికారులను ఆయన కోరారు. టీచర్ల బదిలీ కోసం ఒక్కో టీచర్ వద్ద రూ. 3 లక్షల నుంచి రూ.6 లక్షలు వసూలు చేశారని వర్ల రామయ్య తన ఫిర్యాదులో తెలిపారు. మొత్తంగా రూ.65 కోట్ల వసూళ్లకు బొత్స పాల్పడ్డారని ఆరోపించారు. ఎన్నికల కోడ్ వచ్చాక కూడా టీచర్ల బదిలీలు చేశారని వర్ల రామయ్య ఆరోపించారు. బొత్స హయాంలోం జరిగినంత అవినీతి ఎప్పుడూ జరగలేదన్నారు. గత వైసీపీ పాలనలో పని చేసిన మంత్రుల్లో చాలామంది జైలుకి వెళ్తారంటూ ఆయన హెచ్చరించారు. అవినీతికి పాల్పడిన వారిని వదిలే ప్రసక్తే లేదన్నారు. వైసీపీ నేతల అవినీతి భాగోతం అంతా బయటకు వస్తుందని తెలిపారు వర్ల రామయ్య.

# అమరావతి చేరుకున్న చంద్రబాబు

## ఇక మంత్రివర్గ కూర్పుపై కసరత్తు





అమరావతి, జూన్10 (ప్రజా మంటలు): తెదేపా (అధినేత చంద్రబాబు అమరావతి చేరుకున్నారు. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రివర్గం ప్రమాణస్వీకారం నేపథ్యంలో దిల్లీ వెళ్లిన ఆయన.. నేరుగా గన్నవరం ఎయిర్‌పోర్టుకు వచ్చారు. అక్కడి నుంచి ఉండవల్లిలోని నివాసానికి చేరుకున్నారు. బుధవారం సీఎంగా ఆయన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇప్పటికే దీనికి సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నాయి. మరోవైపు మంత్రివర్గ కూర్పుపై చంద్రబాబు కసరత్తు ముమ్మరం చేయనున్నారు. జిల్లాలవారీగా ఎవరెవరికి అవకాశం కల్పించాల నేదానిపై ముఖ్యనేతలతో ఆయన చర్చించనున్నారు. అనుభవం, వివిధ సామాజిక వర్గాలకు ప్రాధాన్యం తదితర అంశాల ఆధారంగా ఎవరెవరిని మంత్రివర్గంలోకి తీసుకోవాలనే దానిపై ఓ నిర్ణయానికి రానున్నారు. మంగళవారం నాటికి దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఏపీలో కొత్త ప్రభుత్వం కొలువుదీరే సమయం ఆసన్నమైంది. ఈ నెల 12న కేసరపల్లి వేదికగా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అలాగే తన మంత్రివర్గంలో ఎవరెవరికి చోటు కల్పించాలన్న దానిపైనా చంద్రబాబు కసరత్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. పవన్ కళ్యాణ్ పదవి, శాఖలపై ఇటీవల ఓ క్లారిటీ వచ్చినట్టు తెలుస్తోంది. దీనిపై టీడీపీ వర్గాల్లోనూ చర్చ జరుగుతోంది. ఒకవైపు చేతిలో పలు సినిమాలు.. మరోవైపు ప్రజలకు ఇచ్చిన హామీలతో.. పవన్ కళ్యాణ్ కొత్తగా కొలువుదీరే మంత్రివర్గంలో చేరుతారా అన్నది కూడా అనుమానంగా ఉంది. మరోవైపు పవన్ కళ్యాణ్‌కు దాదాపుగా డిప్యూటీ సీఎం పదవి ఖరారైనట్టు టీడీపీ రాజకీయ వర్గాల్లో ఓ టాక్ నడుస్తోంది. అలాగే పవన్ కళ్యాణ్‌కు కీలకమైన శాఖలు ఇవ్వాలని చంద్రబాబు నిర్ణయించినట్టు తెలుస్తోంది. గతంలో ఇరువురు నేతలిద్దరూ పదేపదే సార్లు రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిందని.. అలాగే వైసీపీ ప్రభుత్వం స్థానిక సంస్థలు, పంచాయితీలకు సరిగ్గా నిధులు కూడా కేటాయించలేదని పేర్కొన్నారు. దీంతో హోంశాఖ, గ్రామీణాభివృద్ధి శాఖలు పవన్ కళ్యాణ్‌కి ఇచ్చే ఛాన్స్ ఉన్నట్టు టీడీపీ, జనసేన వర్గాల్లో టాక్ నడుస్తోంది. అయితే దీనిపై మరో రెండు రోజుల్లో అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ఇటీవల జరిగిన ఏపీ ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అద్భుత విజయాన్ని కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. అసెంబ్లీ స్థానాల విషయానికొస్తే.. టీడీపీ 135, బీజేపీ 8, జనసేన 21 గెలుచుకున్నాయి. ఇక ఎంపీ స్థానాల్లో టీడీపీ 16, బీజేపీ 3, జనసేన 2 గెలిచాయి. అటు వైసీపీ 11 అసెంబ్లీ స్థానాలు, 4 లోక్‌సభ స్థానాల్లో గెలుపొందింది.

# వైకాపా ఓటమితో నైతిక బాధ్యత

## నెల్లూరు మేయర్ స్రవంతి రాజీనామా



నెల్లూరు, జూన్10 (ప్రజా మంటలు): ఏపీ ఎన్నికల్లో ఓటమి అనంతరం వైసీపీ వికెట్స్ ఒక్కొక్కటిగా పడుతున్నాయి. నెల్లూరు మేయర్ స్రవంతి ఆ పార్టీకి రాజీనామా చేయబోతున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా స్రవంతి మాట్లాడుతూ ఎలాంటి రాజకీయ నేపథ్యం లేకున్నా తనకు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి కార్పొరేటర్ టికెట్‌ను ఇచ్చారని.. గెలిచిన మీదట తనను మేయర్‌ను చేశారని తెలిపారు. మాలాంటి ఎందరో కార్యకర్తలకు రాజకీయ అవకాశాలు కల్పించారన్నారు. రాజకీయాల్లో తనకు ధైర్యాన్ని ఇచ్చారని స్రవంతి తెలిపారు. శ్రీధర్ రెడ్డి వైసీపీని వీడినప్పుడు కూడా ఆయసతోనే ఉంటానని స్పష్టం చేశానని వెల్లడించారు. అప్పట్లో అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో వైసీపీలోకి వెళ్ళాల్సి వచ్చిందని.. శ్రీధర్ రెడ్డి పై విమర్శలు చేయాలని అక్కడి నాయకులు తమపై ఒత్తిడి తెచ్చారని స్రవంతి తెలిపారు. అయినా సరే.. శ్రీధర్ రెడ్డిని ఒక మాట కూడా మాట్లాడలేదన్నారు. మా తప్పులను శ్రీధర్ రెడ్డి మన్నించి మమ్ములను అక్కున చేర్చుకోవాలని కోరుకుంటున్నామని స్రవంతి అర్థించారు.

## కేశినేని రాజకీయ సన్యాసం

### రాజకీయాల నుంచి తప్పకుంటున్నట్లు ప్రకటన

విజయవాడ,జూన్10(ప్రజా మంటలు): విజయవాడ మాజీ ఎంపీ సంచలన నిర్ణయం తీసుకున్నారు. తాను రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు ట్విట్టర్ లో ప్రకటించారు. రెండుసార్లు ఎంపీగా అవకాశం ఇచ్చిన విజయవాడ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.విజయవాడ అభివృద్ధికి ఎంతో కృషి చేశానన్నారు. అయితే ప్రత్యక్ష రాజకీయాల్లో లేకపోయినా విజయవాడను అభివృద్ధి చేసేందుకు తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటానన్నారు. మొన్నటి ఎన్నికల్లో వైకాపా తరఫున పోటీచేసి ఓడిపోయిన కేశినేని నాని రాజకీయ సన్యాసం తీసుకున్నారు. అయితే గతంలో విజయవాడ చరిత్రను పరిశీలిస్తే.. ఎంపీ గా ఓడిపోయిన నేతలు రాజకీయాలకు దూరంగా ఉన్నారు. ఏపీ ఎన్నికల ఫలితాల తరువాత రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. విజయవాడ మాజీ ఎంపీ కేశినేని నాని రాజకీయాల నుంచి తప్పుకున్నారు.రాజకీయాలకు రిటైర్మెంట్ నిర్ణయాన్ని సోషల్ మీడియా ఎక్స్ ద్వారా ప్రకటించారు. ఇటీవల జరిగిన లోక్ సభ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా విజయవాడ స్థానం నుంచి పోటీ చేసిన కేశినేని నాని ఓడిపోయారు. టీడీపీ నుంచి బరిలోకి దిగిన సోదరుడు కేశినేని చిన్ని 2 లక్షల 82 వేల 85 ఓట్ల తేడాతో కేశినాని నానిపై ఘన విజయం సాధించారు. టీడీపీ నుంచి రెండు పర్యాయాలు టీడీపీ పార్టీ నుంచి విజయవాడ ఎంపీగా కేశినాని నాని గెలుపొందారు.

EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com